


### నకిలీ హోంగార్డుల నియామకాలపై

# పోలీసుశాఖ సీరియస్

**ఆరుగురు హోంగార్డులు, ఒక కానిస్టేబుల్ అరెస్టు**
**ఎస్పీ ప్రమేయం లేకుండా హోంగార్డులను నియమిస్తూ డ్యూటీ టికెట్లు జారీ**
**ఇప్పటి వరకు 87 హోంగార్డులను ఇలా నియమించినట్లు నిర్ధారణ**

చిత్తూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

నకిలీ హోంగార్డుల నియామకాలపై పోలీసు శాఖ సీరియస్ అయ్యింది. అనంతపురం రేంజ్ డిఐజి రవిప్రకాష్ ఆదేశాల మేరకు ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఉత్తర్వులతో చిత్తూరు నగర డిఎస్పీ శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ నరసింహరాజు ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన పోలీసులు సోమవారం పోలీసు శాఖలో ఇంటి దొంగలుగా చెలామణి అవుతున్న ఆరు మంది హోంగార్డులు, ఒక కానిస్టేబుల్‌ను అరెస్టు చేశారు. ఈ కేసు విచారించిన పోలీసులకు పలు ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. హోంగార్డుల నియామకంలో కీలకపాత్ర పోషించాల్సిన ఎస్పీ ప్రమేయం లేకుండానే పోలీస్‌శాఖలో హోంగార్డు సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కొంతమంది హోంగార్డులు ఎస్పీ ప్రమేయం లేకుండానే డ్యూటీ టిక్కెట్లు జారీ చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. 2014 నుండి 2019 సంవత్సరం వరకు పోలీసు శాఖలో హోంగార్డు సెక్షన్‌లో కీలకంగా విధులు నిర్వర్తించే హోంగార్డులు, కానిస్టేబుళ్ళు ఒకొక్క సంవత్సరం కొంతమందికి ఎస్పీ ప్రమేయం లేకుండానే హోమ్‌గార్డులను నియమించి వారికి నకిలీ డిఓలు జారీ చేసి డ్యూటీ టిక్కెట్లు ఇప్పించినట్లు పోలీసులు గుర్తించారు. హోమ్‌గార్డుల విధుల నిర్వహణ రెండు విధాలుగా వుంటుంది. ఇందులో ఒకటి లాఅండ్‌ఆర్డర్ కాగా మరొకటి ఆన్ పేమెంట్ విభాగాలు. లా అండ్ ఆర్డర్‌లో హోంగార్డులుగా నియమితులైన వారి విధులు డైరెక్టుగా ఎస్పీ కంట్రోల్‌లో వుంటుంది. వీరికి జిల్లా పోలీసు కార్యాలయం ద్వారా ప్రతి నెలా జీతాలు చెల్లిస్తారు. అలాగే ఆన్ పేమెంట్ బేసిస్ కింద ఎస్పీ హోంగార్డులను నియమించి 9 ప్రభుత్వ శాఖలకు హోమ్‌గార్డ్సును కేటాయిస్తారు. ఇందులో ఎపిఎస్‌ఆర్టీసీ, ఫైర్, శ్రీకాణిపాకం స్వయంభూ వరసిద్ది వినాయకస్వామి దేవస్థానం, తిరుమల తిరుపతి దేవస్థానం, ఆర్‌పిఎఫ్, ఆర్‌టిఎ, జైళ్ళ శాఖ, ఎపిఎస్‌పిడిసిఎల్, ఎఫ్‌సిఐ డిపార్ట్‌మెంట్లు వున్నాయి. ఈ శాఖల్లో హోమ్‌గార్డులుగా నియమితులైన వారు ఆ శాఖల నుండి హోమ్‌గార్డులకు నేరుగా జీతాలు చెల్లించడం జరుగుతుంది. ఆన్ పేమెంట్ బేసిస్ కింద అవసరమైన మేరకు హోమ్‌గార్డులను నియమించాలని ఆ శాఖల ఉన్నత అధికారులు ఎస్పీకి వినతిపత్రం అందిస్తారు. ఈ మేరకు ఎస్పీ ఆయా శాఖలకు అవసరమైన హోమ్‌గార్డులను నియమించి ఆ శాఖలకు కేటాయిస్తుంటారు. ఎస్పీ కంట్రోల్‌లో వుండే లాఅండ్‌ఆర్డర్ కింద చేపట్టే హోమ్‌గార్డుల నియామకాల్లో పొరబాట్లు చేస్తే సులభంగా చిక్కుకొంటామని భావించిన వీరు ఆన్ పేమెంట్ బేసిస్ కింద చేపట్టే హోమ్‌గార్డుల నియామకాలపై దృష్టి కేంద్రీకరించి భారీగా అక్రమాలకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. ఆన్ పేమెంట్ బేసిక్ కింద చేపట్టే హోంగార్డు నియామకాలకు అవసరమైన శాఖలను గుర్తించిన పోలీసు శాఖలో హోమ్‌గార్డు వ్రైటర్‌గా విధులు నిర్వర్తించే మణిగండన్, హోమ్‌గార్డు ఇన్‌ఛార్జీ కానిస్టేబుల్ జయకుమార్, జిల్లా పోలీసు కార్యాలయంలో హోమ్‌గార్డు గుమస్తాకు సహాయకుడిగా విధులు నిర్వర్తించే కిరణ్‌కుమార్‌లు కలిసి ఎలాగైనా అక్రమంగా డబ్బులు సంపాదించాలని భావించి వారికి పరిచయమైన వారితో హోమ్‌గార్డు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఒకొక్క నిరుద్యోగ యువకుడి నుండి 2 నుండి 5 లక్షల రూపాయల వరకు తీసుకొని నకిలీ డ్యూటీ పత్రాలు సృష్టించి వివిధ శాఖల్లో వున్న ఖాళీలకు డ్యూటీ పత్రాలు ఇప్పించి పంపివేశారు. ఈ మేరకు ఎస్పీనే తమను నియమించినట్లు భావించిన హోమ్‌గార్డులుగా నియమితులైన యువకులు సంబంధిత శాఖలకు వెళ్ళి విధుల్లో చేరి ఇప్పటి వరకు విధులు నిర్వహిస్తున్నారు. 2014 నుండి 2019 సంవత్సరం వరకు హోంగార్డులు మణిగండన్, కిరణ్‌కుమార్, కానిస్టేబుల్ జయకుమార్‌లతో పాటు హోంగార్డులు యువరాజ్, సుల్తాన్, సలీంభాషా, చిరంజీవిలు 87 మంది హోమ్‌గార్డులను నకిలీ డ్యూటీ పత్రాలు ఇచ్చి వివిధ శాఖల్లో హోమ్‌గార్డులుగా విధుల్లో పెట్టారు. ఈ మేరకు వీరు 2014 సంవత్సరంలో 12 మంది హోమ్‌గార్డులను 2015లో 15, 2016లో 15, 2017లో 25, 2018లో 11, 2019లో 9 మంది హోమ్‌గార్డ్సును వివిధ శాఖల్లో నియమించారు. ఈ మేరకు పోలీసుశాఖకు అనుమానం రావడంతో దీనిపై విచారణ చేపట్టిన చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు హోంగార్డులైన చిత్తూరు మురకంబట్టుకు చెందిన ఆర్.మణిగండన్(39), గిరింపేట ఓటిచెరువుకు చెందిన టి.యువరాజ్(38), చిత్తూరు రూరల్ మండలం భరత్‌నగర్ సిజి పల్లికి చెందిన బిఆర్ కిరణ్‌కుమార్(40), న్యూబాలాజీ కాలనీకి చెందిన డి.సుల్తాన్(34), గిరింపేట వళ్ళియప్పనగర్‌కు చెందిన సలీంభాష(30), పెనుమూరు కలవగుంటకు చెందిన చిరంజీవి(36), కానిస్టేబుల్ బంగారుపాళ్యం మొగిలి వెంకటగిరికి చెందిన జయకుమార్(51)లను సోమవారం అరెస్టు చేశారు. ఈ కేసును మరింత లోతుగా విచారించి మరిన్ని వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి నిందితులపై చర్యలు తీసుకొంటామని వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ నరసింహరాజు పేర్కొన్నారు.

## స్పందనకు 154 అర్జీలు



చిత్తూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హరినారాయణన్ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమంకు ఈ వారం జిల్లా నలుమూలల నుండి 154 మంది ప్రజలు సమస్యలపై కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. ఈ అర్జీలను పరిశీలించిన కలెక్టర్ సత్వరం పరిశీలించి సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబందించి 79, సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్స్ 12, హౌసింగ్ 2, పంచాయతీరాజ్‌కు సంబంధించి ఒక అర్జీ అందాయి. అలాగే ఆన్‌లైన్‌లో నమోదు కాని అర్జీలు 55 అందాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డిఆర్‌ఓ రాజశేఖర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పొలాల వెంట నీళ్లు.. రైతన్న కంట కన్నీళ్లు

### తీరప్రాంతంలో ఎక్కడ చూసినా జలమయమే - రైతుల్లో ఇంకా తుపాను భయమే



పులికాట్ ఒడ్డున కారిజాత వద్ద మునిగి పంట పొలాలు

తడ, డిసెంబర్ 12 ప్రభాతవార్త

ఒకదాని వెంట ఒకటి అన్నట్లుగా మళ్లీ మళ్లీ బంగాళాఖాతంలో తుపాన్లు వస్తుండటం తడ రైతన్న గుండె గుబేలుమంటోంది. మాండూస్ తుపాను అలా ఆగిందో లేదో ఆ వెంటనే మంగళవారం తుపాను ఉంటుందన్న వాతావరణ హెచ్చరికలు పులికాట్ తీరాన్ని వణికిస్తున్నాయి. అప్పుడే తుపాను వాతావరణం మళ్లీ మొదలైంది. సోమవారం వర్షం జల్లులు జల్లులుగా కురుస్తోంది. దీనికితోడు వాతావరణంలో చిమ్మచీకట్లు కమ్ముకొని భయపెడుతున్నాయి. ఇదిలావుంటే తడ మండల పరిధిలో ఇప్పటికీ కాళంగినది ప్రవాహం తగ్గలేదు. కొండూరు సమీపాన మూడు చోట్ల కాళంగికి గండ్లు పడ్డాయి. ఆ ప్రాంతానికి నేరుగా రైతులు గాని, అధికారులు గాని వెళ్లే పరిస్థితి లేదు. నీళ్ల దక్షిణం వైపు పంట పొలాల్లోకి ఎగబడటంతో ఒక్క కొండూరు మాత్రమే కాకుండా పులివేంద్ర, సుందరపురం, గ్రద్దగుంట, చేనిగుంట పొలాల్లోకి వరద నీళ్లు యథేచ్ఛగా చేరుకుంటున్నాయి. దీంతో ఈ సారి ముందుగానే వరి పైరు చల్లుకున్న రైతులు నిండా మునిగిపోయారు. నాట్లు వేసుకున్న రైతుల పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. మందులు చల్లుకోకముందే వరద ముంచెత్తిందని పలువురు రైతులు తెలిపారు. ఇటు కారిజాత, పాములమిట్ట, వాటంబేడు, తోపుకండ్రిగ, పల్లెపాలెం, గొల్లలమెలువు గ్రామాల్లోనూ వరద నీరు తగ్గలేదు. ఈ పల్లెల్లో ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులు పంట పొలాల్లోకి వెళ్లి నష్టాన్ని పరిశీలించారు. పాములకాలువ సమీపంలోని కాదలూరు, వెండ్లూరుపాడు, పొన్నపాడు, కట్టవ, మాంబట్టు, ఎన్‌ఎంకండ్రిగ గ్రామాల్లోనూ పంటపొలాలు మునిగిపోయాయి. కాళంగి గేట్లు ఎత్తేయడంతో ఆ ప్రభావం ఈ పల్లెల మీద ముందుగా పడింది. అండగుండల, తడకండ్రిగలలోని లోతట్టు ప్రాంతాలు సైతం జలమయమై వరిపొలాలు మునకలోనే ఉన్నాయి. ప్రాథమిక అంచనా ప్రకారం మండలంలోని 13 గ్రామాల్లో 1080 ఎకరాలు మునిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నారు. అయితే మళ్లీ ఎన్యుమరేషన్ జరిపేందుకు సిద్ధమవుతున్నారు. సోమవారం సూళ్లూరుపేటలో రెవెన్యూ, వ్యవసాయ, తదితర శాఖల అధికారులతో ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. మరోవైపు జిల్లా కేంద్రం నుంచి కూడా అధికారులు స్థానిక అధికారులను పల్లెబాట పట్టాలని

## పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

### స్తంభించిపోయిన రాకపోకలు

ఓజిలి, డిసెంబర్ 12, ప్రభాతవారత

ఇటీవల కురిసిన భారీ వర్షాలు అయితేనేమి, తాజాగా మాండూస్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు ఓజిలి మండలాల్లో సాధారణ వర్షపాతం కన్నా ఎక్కువగా నమోదైంది. మరో వైపు మాండూస్ ముప్పు తొలగినప్పటికీ ఓజిలి మండలంలోని గ్రామాల్లో వర్షం కారణంగా వాగులు, వంకలు పొంగి పొర్లుతూ సగుటూరు, కర్ర బల్లవోలు, మనవాలి, నెమల్లపూడి, చిలమానుచేను, వడ్డిపాలెం, దాదాపు పది గ్రామాల రాకపోకలు స్తంభించిపోయింది. పలు చోట్ల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అధికారులు తక్షణమే చర్యలు తీసుకుంటూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. మాండూస్ తుఫాన్ రైతులను నిలువునా ముంచింది. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు వేలాది ఎకరాల్లో పంట నీట మునిగాయి. గత ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా, లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. మనవాలి, ఓజిలి, పున్నేపల్లి, కర్ర బల్లవోలు, వెంకటరెడ్డిపాలెం,



మానమాల, ఇంకా పలు ప్రాంతాల్లో పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. వ్యవసాయ శాఖ అధికారిని విజయలక్ష్మి వివరణ కోరగా ఆమె తెలిపిన వివరాలుమేరకు దాదాపు 200 ఎకరాలు పంట పొలాలు, 40 ఎకరాల వరి నాట్లు నీటమునిగినట్లు తెలిపారు. ఉన్నధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులను ఆదుకునేలా చూస్తామని ఆమె తెలిపారు. తుఫాన్ కారణం వల్ల రైతులకు తీరని నష్టం వాటిల్లింది. కురిసిన భారీ వర్షాలతో పంట పొలాల్లోకి నీరు చేరింది. రైతన్నలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# మానవతా దృక్పథంతో విధులు

**పంట నష్ట అంచనాపై**
**వీడియో కాన్ఫరెన్స్‌లో**
**సిఎం జగన్మోహన్‌రెడ్డి**



సిఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

మాండూస్ తుఫాను ప్రభావంతో పంట, ఇతర ఆస్తులు నష్టపోయిన వారికి అధికారులు మానవతా దృక్పథంతో విధులు నిర్వర్తించి ఉదారంగా సహాయపడాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుండి సోమవారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కలెక్టర్ హరినారాయణన్, ఇతర జిల్లా అధికారులతో మాండూస్ తుఫాను సహాయంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో సిఎం మాట్లాడుతూ రైతులు ఎక్కడా నిరాశ చెందకుండా పంట ఎన్యుమరేషన్ విషయంలో అధికారులు ఉదారంగా వ్యవహరించాలన్నారు. రైతులు మళ్ళీ పంటలు సాగు చేసుకోవడానికి 80 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. వారం రోజులలోపు పంట నష్టప రిహారం అంచనాలను రూపొందించి సమర్పించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పంట నష్టం ఎన్యుమరేషన్ ప్రక్రియ మొదలైందని, జిల్లాలో ప్రాథమికంగా 26 మండలాల పరిధిలో 170 గ్రామాల్లో 338.4 హెక్టార్ల విస్తీర్ణంలో పంట నష్టం జరిగిందని గుర్తించడం జరిగిందన్నారు.

# మత్తుమందు ఇచ్చి మోసం

### గుర్తుతెలియని మహిళ చేతిలో హైదరాబాదు వాసి గుల్ల



లాడ్జిలోకి వెళుతున్న గుర్తు తెలియని మహిళ

శ్రీకాళహస్తి, డిసెంబర్12 ప్రభాతవార్త

'మాయ చేసింది, నమ్మబలికింది. లాడ్జిలో దించింది. స్వామి అమ్మవార్ల దదర్శనం అంటూ పులిహోర తెచ్చి తినిపించింది. హైదరాబాదు వాసి నుంచి సర్వం దోచుకుపోయింది. బస్సులో పరిచయం ఆ విద్యావంతుని పూర్తిగా దోచుకునేటట్లు చేసింది. సిఐ అంజూయాదవ్ అందించిన సమాచారం మేరకు.. హైదరాబాదు మియాపూర్‌కు చెందిన ఆయుర్వేద మందుల ప్రమోటర్ లక్ష్మణ్ (64) గురువారం రాత్రి బయలు దేరారు. తిరుపతిలో దర్శనం చేసుకున్న లక్ష్మణ్ శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి బయలుదేరారు. బస్సులో ఓ గుర్తుతెలియని మధ్య వయస్సు మహిళ పరిచయమైంది. ఒకరి నొకరు పరిచయం చేసుకుంటూ తమ వృత్తుల గురించి చెప్పగా తనకు ఆయుర్వేద మందులు కావాలని ఏమార్చినట్లు ఫిర్యాది తెలిపినట్లు సిఐ వివరించారు. ఈ నేపథ్యంలో ఇద్దరు శ్రీకాళహస్తి చేరారు. శుక్రవారం ఇక్కడకు చేరుకున్న లక్ష్మణ్ గుర్తుతెలియని మహిళ తేరువీధిలోని ఓ ప్రైవేటు లాడ్జిలో గదితీసుకున్నారు. అయితే మహిళ శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వెళ్ళి ప్రసాదం తెచ్చినట్లు తనను మభ్యపెట్టినట్లు పిర్యాదులో పేర్కొన్నారు. ఆ పులిహోర పూర్తిగా తాను తిన్నానని, దాంతో ఏం జరిగిందో తెలియదని వివరించారు. శనివారం లాడ్జి బాయ్ వచ్చి తలుపు తట్టగా లేవగా ఆయోమయంగా ఉం డటం తన వద్ద సొమ్ములు నగదు లేకపోవటంతో లక్ష్మణ్ లాడ్జి బాయ్ వద్ద ఫోన్ తీసుకొని హైదరా బాదులోని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. లక్ష్మణకు భార్య ఇద్దరు కుమారులున్నారు. వారు ఆదివారం ఇక్కడకు చేరుకున్నారు. లక్ష్మణ్ పరిస్థితి బాగా లేకపోవటంతో ఆతన్ని తిరుపతిలో వైద్య చికిత్స కోసం తరలించారు. అయితే మీడియా వారు చేరుకోగా లాడ్జిని మార్చినట్లు వివరించారు. సోమవారం బాధితులు ఫిర్యాదుచేసినట్లు సిఐ అంజూ యాదవ్ వివరించారు. వారి ఫిర్యాదులో ఒక చైను, బ్రాస్‌లైట్, వెరసి 68 గ్రాముల బంగారు, సెల్‌ఫోన్, రూ.1100 నగదు 'మాయలేడి తీసుకెళ్లిందని' పిర్యాదు చేసినట్లు సిఐ వివరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

# పారిశుధ్యంపై ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వండి

**నష్టాల అంచనాలు, లబ్దిదారుల జాబితాను సచివాలయాల్లో ప్రదర్శించాలి**
**- తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి**



తిరుపతిరూరల్, డిసెంబర్12 ప్రభాతవార్త:

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు అధిక ప్రాధాన్యత కల్పించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుండి అన్ని డివిజన్స్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫెరేన్స్ నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు చేపట్టాల్సిన సహాయక చర్యలు, అందించాల్సిన పరిహారాలపై దిశానిర్ధేశం చేసారు. వీడియో కాన్ఫెరేన్స్‌లో కలెక్టర్ మాట్లడుతూ మాండూస్ తుఫాన్ ప్రభావం నష్టం జరిగిన వాళ్ళకు మానవతా దృక్పథంతో పరిహారం అందించాలని సూచించారన్నారు. ముఖ్యమంత్రి సూచన మేరకు పునరావాస కేంద్రాలలో ఉన్నవారికి ఒకరైతే రూ.1000, ఒకే కుటుంబంలో ఇద్దరు ఆపైన ఉంటే రూ.2000 రూపాయలు పరిహారం అందించాలన్నారు. తుఫాన్ వల్ల ఇళ్లలోకి నీరు చేరిన ప్రతి ఒక్కరికి నిత్యవసర వస్తువులు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు పశువులు 7, దూడలు 9, గొర్రెలు 13 వరకు చనిపోయినట్లు ప్రాథమిక అంఛనాలో తెలిసిన మేరకు పరిహారం 24 గంటల లోపు అందజేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. అలాగే జిల్లాలో ఇప్పటివరకు 159 గృహాలు దెబ్బతిన్నాయనే అంఛనాల మేరకు అందులో పూర్తిగా దెబ్బతిన్న వివరాలు, పాక్షికంగా దెబ్బతిన్న వివరాలు పరిహారం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి, జాభితాను సచివాలయాల్లో ప్రదర్శించాలన్నారు. వ్యవసాయ శాఖ, ఉద్యాన శా, సిరి కల్చర్ సంయుక్తంగా పంట నష్టాల అంఛనాలను ఈ నెల 14 నుండి 21లోపల పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ కమీషనర్ ఆదేశించారన్నారు. జాయింట్ కలెక్టర్ డికె.బాలాజీ మాట్లాడుతూ ఇళ్లలో నీరు చేరిన ఉంటే తప్పనిసరిగా నిత్యవసర వస్తువులు అందించాలని ముఖ్యమంత్రి వీడియో కాన్ఫెరేన్స్‌లో ఆదేశించారన్నారు. సమీక్షలో డిఆర్వో శ్రీనివాసరావు, డిపిఓ రాజశేఖర్‌రెడ్డి, ఆర్ అండ్ బి సుధాకర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ శంకరనారాయణ, ఆర్ డబ్ల్యుఎస్ విజయకుమార్, వ్యవసాయాధికారి ప్రసాదరావు, హార్టికల్చర్ అధికారి దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో జాతర చాటింపు



శ్రీకాళహస్తి, డిసెంబర్ 12 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో నిర్వహించే ఏడుగంగమ్మల జాతరకు ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత చాటింపు నిర్వహించారు. పట్టణం సద్దుమణిగాక నిర్వాహకులు ఈ కార్యక్రమాల్ని చేపట్టారు. చాటింపు కార్యక్రమాల్లో పోలసామి స్వర్ణమూర్తి, షణ్ముగం, శేఖర్, రాజు, డడూండి నాదముని, రవి, బాల, శంకర్, బాబు, సత్య, కార్తీకేయన్ తదదితరులు పాల్గొన్నారు. స్థానిక సంప్రదాయం మేరకు, శాస్త్రోక్తంగా చాటింపు ప్రారంభించారు. పొలి చల్లుతూ చాటింపు చేశారు. పట్టణ నిర్మాణంలో నాటి రాజులు సరిహద్దులుగా తెట్టురాళ్ళను ఏర్పాటు చేశారు. ఇటు బహాదూరుపేట, కొత్తపేట, ముత్యాలమ్మగుడివీధి, సన్నిధివీధి, జయరామారావువీధి ప్రాంతాల్లో తెట్టురాళ్ళను ఏర్పాటు చేశారు. జాతర చాటింపు సందర్భంగా ఇక్కడ పూజలు నిర్వహించటం ఆనవాయితి. దాంతో జాతర కార్యక్రమాలు ప్రతి ఏడాది నగరివీధిలోని గంగమ్మ రాయి వద్ద నుంచి చాటింపును ప్రారంభిస్తారు. తరువాత డప్పుల మోతతో దివిటీల వెలుగులో ఏడు చోట్ల కుంభం వేసి పొలి చల్లుకుంటూ సాగారు. దాంతో జాతర సంబరాలకు శ్రీకారం చుట్టారు.

# తెలుగుతమ్ముళ్ళ మాటేమౌనం!

### -ధీటుగా పోరాడే సాహసమేదీ!?



ప్రభాతవార్త-తిరుపతి:

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబనాయుడు సొంత జిల్లాలో తెలుగుతమ్ముళ్ళ పరిస్థితి రోజురోజుకూ మాటేమౌనం అనే చందంగా తయారైందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత మూడున్నరేళ్ళ కాలంలో అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యే విమర్శలపైగానీ , వైసిపి నేతల వ్యాఖ్యలపై ధీటుగా సమాధానమిచ్చే తెలుగుదేశం కేడర్ లేకపోయిందనే ఆవేదన కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలియని అయోమయంలో ఉన్నప్పటికీ పార్టీ కేడర్‌ను బలోపేతం చేసి సైనికుల్లా తీర్చిదిద్దేందుకు అధినేత చంద్రబాబు ఇటీవల విజయవాడ మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర నేతలతో, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, పార్లమెంట్ కమిటీ ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రానున్న ఎన్నికలే లక్ష్యంగా....అధికార పార్టీపై పట్టుసాధించి గెలుపు దిశగా పనిచేయాలని దిశానిర్ధేశం చేశారు. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు వ్యూహాత్మకంగా పనిచేయాలని నిర్ధేశించారు. అధినేత నిర్దేశం చేసి రెండు వారాలు కావస్తున్నా ఇప్పటికీ ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో టిడిపి శ్రేణులు ప్రజల పక్షాన పోరాటం చేసిన దాఖలాలు లేవనేది కార్యకర్తలు అసహనం చెందుతున్నారు. ఏకంగా ప్రజల మద్దతు ఉన్న వారికే, గెలిచే వారికే టిక్కెట్లు ఇస్తానని చంద్రబాబు తేల్చేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉమ్మడి చిత్తూరుజిల్లాలో 2019 ఎన్నికల తరువాత బలమైన ఇన్‌ఛార్జిలు కూడా లేకపోయారని, పార్టీలో కార్యకర్తలు సాహసంతో ముందడుగు వేస్తున్నా నాయకులు కదలడంలేదని, ఏదో మొక్కుబడిగా పార్టీ ఆదేశించిన కార్యక్రమాలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారనే అపవాదు లేకపోలేదు. ఇటీవల అధికార వైసిపి నేతలు బిసి మహాగర్జన పేరుతో నిర్వహించిన బహిరంగ సభలో టిడిపి పై, చంద్రబాబు పై వ్యాఖ్యలు చేసినా వాటిని తిప్పికొట్టేలా తిరుపతి, చిత్తూరు నియోజకవర్గాల్లో గట్టి కార్యక్రమాలు చేపట్టలేదని ప్రజల్లో గుప్పుమంటోంది. ఓ వైపు ఎన్నికలకు సమాయాత్తం కావాలని పిలుపునిచ్చినా పార్టీ కేడర్, శ్రేణులు ఆ దిశగా వ్యూహాన్ని సిద్ధం చేసుకోవడం లేదనేది కార్యకర్తల్లో అసహనం . అధికార వైఎస్ఆర్‌కాంగ్రెస్‌పార్టీ నేతలు పేల్చుతున్న మాటలతూటాలకు తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ధీటుగా జవాబిచ్చే తెలుగుదేశం నాయకులు లేకపోతున్నారనేది ఆ పార్టీలో గుప్పుమంటోంది. ఉమ్మడిచిత్తూరుజిల్లాలో చాలా వరకు పార్టీ బలహీనంగా ఉందని, బలోపేతం చేయాల్సిన అవసం ఉందని కార్యకర్తలు చెబుతున్నారు. 2019 ఎన్నికల తరువాత ఇప్పుడిప్పుడే ఒకరిద్దరు నేతలు ముందుకు వచ్చినా వారికి పార్టీ శ్రేణులు సహకరించడంలేదనేది చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ,ఎన్నికల్లో గెలుపు ధ్యేయంగా 2023 జనవరి 15 తరువాత కొత్తరక్తం ఎక్కించేందుకు అధినేత చంద్రబాబు కీలకంగా వ్యవహరించనున్నారని పార్టీ వర్గాల సమాచారం. అంతేగాక యువనేత నారా లోకేశ్ కూడా జనవరిలో కుప్పం నుంచి పాదయాత్ర చేపట్టనున్నందున ఆ లోపు తిరుపతి ,చిత్తూరు జిల్లాలో పార్టీశ్రేణులను బలోపేతం చేయాలనే ఆలోచనతో ఉన్నారని చెబుతూన్నారు. రెండు జిల్లాల్లో పార్టీలో ఫైర్‌బ్రాండ్ నేతలు లేకపోయారనేది కార్యకర్తల్లో బాహాటంగా వ్యక్తమవుతున్న వ్యాఖ్యలు.

## ద్రవిడ వర్సిటీలో ఘనంగా మహాకవి భారతి జయంతి



కుప్పం, డిసెంబర్ 12 ప్రభాతవార్త

సంఘ సంస్కర్త, మహాకవి భారతిగా ప్రసిద్ధి చెందిన సుబ్రమణ్య భారతి జయంతి వేడుకలను ద్రవిడ వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూజలు చేశారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణ మాట్లాడుతూ సు బ్రమణ్య భారతి తమిళనాడులో 1882లో తూత్తుకుడిలో జన్మించారన్నారు. పదకొండవ ఏటనే కవితలు అల్లడం నేర్చారన్నారు. పట్టుదలతో 32భాషలు నేర్చుకున్నారన్నారు. 1907లో అతను తమిళ, ఆంగ్ల భాషా పత్రికలకు సంపాదకత్వం వహించారన్నారు. తెలుగుభాషను సుందర తెనుంగు అని కీర్తించారన్నారు. కార్యక్రమంలో రెక్టార్ అనురాధ, రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి, ఆచార్య సత్యవాణి, డా॥ పద్మనాభన్, డీన్ వెంకటేశ, అకడమిక్ డీన్ ఆచార్య లోకనాథ, ఆచార్య శివకుమార్, ఆచార్య విష్ణుకుమార్, డా॥ మాబుని, పిఆర్వో దుర్గా ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం - ఎమ్మెల్సీ భరత్



రామకుప్పం, డిసెంబర్ 12 ప్రభాతవార్త

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని చితూ_రు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. సోమవారం గొరివిమాకులపలిల పంచాయతీలోని పలు గ్రామాల్లో ఆయన గడప గడపకు మీ ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల్లో లబ్ది కలిగిస్తామన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఓ పథకంలో లబ్ది కలుగుతోందన్నారు. 2024లో మరలా సిఎంగా జగనన్న ఎన్నికవుతారన్నారు. కుప్పం ఎమ్మెల్యేగా తనను గెలిపించి ఆదరించాలని ప్రజలకు అన్ని వేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచుల సంఘ అధ్యక్షుడు బివి మురళి, నేతలు కేశవరెడ్డి, యశ్వంత్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, బాబురెడ్డి, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లు కూల్చేశాడని ఎంపిటిసిపై పోలీసులకు ఫిర్యాదు



శాంతిపురం, డిసెంబర్ 12 ప్రభాతవార్త

దాదాపు వంద ఏళ్ళ_గా తమకు చెందిన పెంకుటిల్లును ఎంపిటిసి రమేష్ అనే వ్యక్తి అక్రమంగా కూల్చేశాడని మండలంలోని శివకురుబూరుకు చెందిన వెంకటస్వామి రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమ గ్రామంలో తమ తాతల కాలం నాటినుంచి తమకు పెంకుటిల్లు ఉందని అదే ఇంట్లో రమేష్‌కు సైతం సగభాగం ఉండేదన్నారు. అయితే సోమవారం రమేష్ తన భార్య పార్వతమ్మ ఇంటి వద్ద ఉండగా ఆమెను దుర్భాషలాడి జెసిబి సాయంతో పె oకుటిల్లు పూర్తిగా ధ్వంసం చేయించాడన్నారు. తమపై కక్ష సాధింపుతోనే రమేష్ ఇలా చేశాడని తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈవిషయంగా ఎంపిటిసి రమేష్ మాట్లాడుతూ తమకు పూర్వీకుల ఆస్తిలో భాగంగా తమకు వచ్చిన భాగాన్ని మాత్రమే జెసిబితో తొలగించామని అవసరమైతే సర్వే చేయించి ఆ భాగం ఎవరికి వస్తే వారికి వదిలేస్తానన్నారు.

## అప్రెంటిస్‌షిప్ మేళాలో 30మంది విద్యార్థులు ఎంపిక

శాంతిపురం, డిసెంబర్ 12 ప్రభాతవార్త

స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో సోమవారం ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళాను నిర్వహించారు. ప్రముఖ సంస్థలైన హోండా, హిండాల్కో, అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్, భారత్ ఫ్రిట్జ్ వెర్నర్ సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు జరిపారు. 70మంది శిక్షణ విద్యార్థులు హాజరు కాగా వీరిలో 30మందిని సంస్థలు ఎంపిక చేశాయి. వీరికి నెలకు 15వేల వేతనం చెల్లించనున్నారు. కార్యక్రమంలో పుంగనూరు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ శేషారెడ్డి, నేషనల్ ఐటిఐ కరస్పాండెంట్ కృష్ణమనాయుడు, వరుణ్ ఐటిఐ కరస్పాండెంట్ హేమంత్‌కుమబార్, శాంతిపురం ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపాల్ నగేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వార్డు కార్యదర్శి సస్పెన్షన్

చిత్తూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన 28వ వార్డు సచివాలయ ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి వి.సతీష్‌కుమార్‌పై మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ సోమవారం సస్పెన్షన్ వేటు వేశారు. వార్డు కార్యదర్శి సతీష్‌కుమార్ విధులు సక్రమంగా నిర్వర్తించకపోవడంతో పాటు సచివాలయంకు సమస్యలపై వచ్చిన ప్రజలతో మర్యాద పూర్వకంగా మెలగడం లేదని ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు కమీషనర్ విచారణ అధికారిని నియమించి విచారించి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించడంతో కార్యదర్శి సతీష్‌కుమార్‌పై వచ్చిన ఆరోపణలు వాస్తవమని విచారణ అధికారి కమీషనర్‌కు నివేదిక ఇవ్వడంతో అతనిపై కమీషనర్ సస్పెన్షన్ వేటు వేశారు.

## వైకాపా పాలనలోనే గ్రామాల అభివృద్ధి

### - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



గుడిపాల, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని కుప్పిగానిపల్లిలో సోమవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి పథకాలు అర్హులైన వారికి అందుతున్నాయా! లేదా! అని అడిగి తెలుసుకొన్నారు. పథకాలకు అర్హులై వుండి ఇప్పటి వరకు అందకుంటే మళ్ళీ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు పరిశీలించి మంజూరు చేస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను తీసుకువస్తే అధికారులను సత్వరం ప్రజల పేర్కొన్న సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, మండల వైకాపా అధ్యక్షుడు జనార్ధన్, తహసిల్దారు బాబు రాజేంద్రప్రసాద్, నాయకులు రజనీకాంత్, శ్రీధర్‌రెడ్డి, కృష్ణమూర్తి, వెంకటేష్, కారుమేఘం, శింబు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సేవలు బలోపేతం చేయండి

### –జిల్లా నోడల్ అధికారి



పలమనేరు, డిసెంబరు 12, ప్రభాతవార్త:

మండలంలో ఆరోగ్య సేవలను బలోపేతం చేయాలని జిల్లా నోడల్ అధికారి డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.హరినాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెంగరగుంటలో కుటుంబ డాక్టర్ విధానంలో భాగంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అందుబాటులో ఆరోగ్య సేవలు బలోపేతం చేయాడానికి కుటుంబ డాక్టర్ విధానం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. నెలకు రెండు లేదా మూడు సార్లు ప్రతి ఒక్క సచివాలయంలోని వైద్య సిబ్బంది గ్రామాలను సందర్శించాలని, వర్షాలో ఆరోగ్య సమస్యలు రాకుండా తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా.ప్రశాంతి, పర్యవేక్షకులు లక్ష్మీపతి, కుసుమ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## గువ్వకల్లులో 'ఇదేం కర్మ రాష్ట్రానికి'



చిత్తూరురూరల్, డిసెంబరు 12 ప్రభాతవార్త:

చిత్తూరు మండలం గువ్వకల్లు హరిజన వాడలో సోమవారం మండల తెలుగుదేశం నాయకులు ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇంటింటికి వెళ్లి నిత్యావసర ధరలు, కరెంటు, ఇంటిపై, చెత్తపై పన్ను, గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచిన ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజు, మండల ప్రధాన కార్యదర్శి రఘు, జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు మేషక్, కందస్వామి, మూర్తి, సురేష్, పురుషోత్తం, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## నిండిన డికెపల్లి చెరువు.. మొరవ ప్రవాహం



కుప్పంరూరల్, డిసెంబర్ 12 ప్రభాతవార్త

కుప్పం మున్సిపాలిటీ పరిధి డికెపల్లి చెరువు పూర్తిస్థాయిలో నిండింది. గత మూడు రోజులుగా కురిసిన వర్షంతో పాటు ఎగువన ఉన్న గుడుపల్లె మండలం నుంచి సైతం చెరువుకు నీరు వచ్చి చేరింది. దీంతో చెరువు మరువ ప్రవాహం మొదలైంది. చెరువు పూర్తిస్థాయిలో నిండి ఉన్న నేపథ్యంలో వచ్చే వేసవిలో పట్టణంలో నీటి సమస్య ఉండబోదని తెలుస్తోంది.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## రాష్ట్ర పబ్లిక్‌హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ



చిత్తూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

రాష్ట్ర పబ్లిక్‌హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉపాధ్యక్షుడిగా యాదమరి పిహెచ్‌సి సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఎపి పబ్లిక్‌హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 29వ రాష్ట్ర సర్వజన మహాసభ ఆదివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగింది. ఈ సభలో రాష్ట్ర అధ్యక్షుడు అస్కార్‌రావు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన లక్ష్మీనారాయణను యాదమరి పిహెచ్‌సి డాక్టర్లు జ్యోతి, సురేఖలు, పిహెచ్‌సి సిబ్బంది అభినందించారు.

## వరసిద్ధుని సన్నిధిలో తెలంగాణా హైకోర్టు జడ్జి

కాణిపాకం, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

తెలంగాణా హైకోర్టు జడ్జి జస్టిస్ అనుపమ చక్రవర్తి సోమవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ ఎ.వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వారి వెంట ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్, తవణంపల్లె ఎస్సై ప్రసాద్, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన ఎఎస్ఐ భార్యకు రూ. లక్ష చెక్కు పంపిణీ



చిత్తూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

చిత్తూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఎఎస్ఐ రమేష్‌కుమార్ సతీమణి సుభాషిణికి సోమవారం అడ్మిన్ ఎఎస్పీ పి.జగదీష్ ఇమ్మిడియేట్ డెత్ రిలీఫ్ ఫండ్ కింద ఒక లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అడ్మిన్ ఎఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ మృతి చెందిన ఎఎస్ఐ రమేష్‌కుమార్ కుటుంబంకు భరోసా కల్పిస్తూ పోలీసు శాఖ అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ యూనియన్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సత్వరం రేషన్‌కార్డులు మంజూరు



పాలసముద్రం, డిసెంబర్ 12 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలం మణిపురం సన్నగుంట ఎస్టీ కాలనీలోని అర్హులైన వారికి సత్వరం రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు మంజూరు చేయాలని జిడినెల్లూరు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ యుగంధర్ పొన్న డిమాండ్ చేశారు. మణిపురం సన్నగుంట ఎస్టీ కాలనీను ఆయన సోమవారం పర్యటించారు. ఇక్కడ అత్యధికులకు ఇంటి పట్టాలను సైతం అధికారులు మంజూరు చేయలేని జనసేన పార్టీ ఈ గ్రామంలోని అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందేలా పోరాటం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలసముద్రం జనసేన మండల అధ్యక్షుడు లతీష్, కార్వేటినగరం ప్రధాన కార్యదర్శి సోము, నాయకులు రాఘవ, శివ పాల్గొన్నారు.

## వేగవంతంగా పంట నష్టం అంచనా

పాలసముద్రం, డిసెంబర్ 12 ప్రభాతవార్త: మాండూస్ తుఫాను ప్రభావంతో పాలసముద్రం మండల పరిధిలో జరిగిన పంట నష్టంను వేగవంతంగా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఢిల్లీ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలో వినాయకపురం, సింహారాజుపురం గ్రామాల్లో ఎక్కవ పంట నష్టం జరిగిందని, ఇప్పటికే 17.5 ఎకరాల విస్తీర్ణంలో పూర్తిగా పంట నష్టం జరిగినట్లు గుర్తించడం జరిగిందన్నారు.

## రామాపురంలో వైద్యశిబిరం

శాంతిపురం, డిసెంబర్ 12 ప్రభాతవార్త

మండలంలోని రామాపురంలో సోమవారం వైద్య శిబిరాన్ని వైద్యాధికారులు, సిబ్బంది నిర్వహించారు. 27మంది శిబిరంకు హాజరయ్యారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఈసందర్భంగా ప్రజలకు సూచించారు. అన్ని సచివాలయాల పరిధిలో ఫీవర్ సర్వే, నీటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డా॥ లోకేష్ తెలిపారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## పొంగుతున్న కాలువలు, నదులు



దొరవారిసత్రం, డిసెంబర్ 12 ప్రభాతవార్త

దొరవారిసత్రం మండల పరిధిలోని చెరువులు, వాగులు, వంకలు, కాలువలు పొంగుతున్నాయి. మాండోస్ తుపాను కారణంగా మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో ఉన్న చెరువులు, వాగులు, కాలువలు కొన్ని ప్రమాదకరంగా ఉన్నాయి. వెదురుపట్టు, ఏకొల్లు, నేలపట్టు తదితర చెరువులు ప్రమాదకరంగా మారి ప్రమాదం పొంచి ఉంది. ఈ చెరువులు తెగకుండా ముందస్తుగా రైతులు ఇసుక బస్తాలతో ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీనిపై అధికారులు కూడా స్పందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## జలదిగ్బంధంలో ప్రాథమిక పాఠశాల



వెంకటగిరి, డిసెంబరు 12, ప్రభాతవార్త:

పట్టణంలోని బ్యాండ్‌పాళెం ప్రాథమిక పాఠశాల తుఫాను కారణంగా వర్షపునీటితో నిండిపోయింది. పాఠశాలలోకి విద్యార్థులు, ఉపాధ్యాయులు వెళ్లేందుకు సోమవారం ఇబ్బందులు పడ్డారు. తుఫాను కారణంగా విస్తారంగా వర్షాలు పడడంతో పాఠశాల మొత్తం నీటితో నిండిపోయింది. ఎంపీడీవో కోటేశ్వరరావు సిబ్బందితో వెళ్లి పాఠశాల నీటిని స్థానికుల ద్వారా కాలువ తీసి తొలగించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి తుఫాను నష్టాల వివరాలను తెలుసుకున్నారు.

## నిండా మునిగిన రైతులు



కోట, డిసెంబర్ 12 ప్రభాతవార్త

మాండోస్ తుపాను కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో వరి నాట్లు, నారుమడులు దెబ్బతిన్నాయి. పలుచోట్ల పొలాల్లోనే మొలకలు వస్తున్నాయి. ఇటీవల నాట్లు వేసిన వరి కూడా నీట మునిగింది. మండలంలోని గూడలి, రుద్రవరం, ఊనుగుంటపాలెం, చిట్టేడు, కర్లపూడి, సిద్ధవరం, వంజివాక, అల్లంపాడు గ్రామాల్లో వందలాది ఎకరాల్లో వరినారు మడులు మునిగిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

## దొరవారిసత్రంలో 46.4 మిమీల వర్షపాతం నమోదు

దొరవారిసత్రం, డిసెంబర్ 12 ప్రభాతవార్త

దొరవారిసత్రం మండల కేంద్రంలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు 46.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయ గణాంక అధికారి భక్తవత్సలం ఒక ప్రకటనలో తెలిపారు.

## గొట్టికాడు చెరువు కట్టకు ముందుజాగ్రత్తగా గండి కొట్టించిన ఆర్డీవో



బాలాయపల్లి, డిసెంబరు 12, ప్రభాతవార్త:

బాలాయపల్లి మండలం గొట్టికాడు చెరువు నిండడంతో ప్రమాదం పొంచి ఉందని తెలుసుకుని గూడూరు ఆర్డీవో రైతుల చేత కోస కట్టకు గండి కొట్టించారు. గూడూరు ఆర్డీవో తఫాను కారణంగా చెరువులను పరిశీలించేందకు గొట్టికాడు గ్రామానికి రాగా చెరువు నిండిందని, ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గొట్టికాడు చెరువుకు భారీగా వరదనీరు వస్తుండడంతో తెగిపోతుందని గుర్తించిన ఆర్డీవో యుద్ధప్రాతిపదికన కోసకట్టను తెగ్గొట్టించారు.

## రెవెన్యూ కార్యాలయంలో ఉరుస్తున్న గదులు

### ఊడుతున్న పెచ్చులు

### భయం గుప్పిట్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు

ఓజిలి, డిసెంబర్ 12, ప్రభాతవార్త

రెవెన్యూ కార్యాలయంలో ఉరుస్తున్న గదులు, ఊడుతున్న పెచ్చులు దర్శనమిస్తున్నాయి. పెచ్చులు ఊడి బయటపడ్డ కమ్మీలు కనిపిస్తున్నాయి. భయం గుప్పిట్లో అధికారులు ఉద్యోగం చేస్తున్నారు. పెచ్చులు, ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయి. గోడలు పెచ్చులూడి ఉరుస్తున్నాయి. ఇది ఓజిలి మండలంలోని రెవెన్యూ కార్యాలయం దుస్థితి. శిథిలావస్థకు చేరుకున్న రెవెన్యూ కార్యాలయం దుస్థితి. మాండూస్ తుఫాన్ కారణంగా గత ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కారణంగా ఉరుస్తోంది. కార్యాలయంలో రికార్డులు .తడిచి ముద్దయిపోయాయ. వర్షాలకు పై కప్పు కూడా నానిపోయి పెచ్చులు ఊడిపడుతుండటంతో సిబ్బంది హడలిపోతున్నారు. అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాల్సినఅవసరం వుంది. ప్రస్తుతం మాండోస్ తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా రెవెన్యూ కార్యాలయంలో గదులు ఉరుస్తున్నాయి. ఏళ్ళ నాటి గదులు కావడంతో ప్రమాదకరంగా మారాయి. దీంతో అధికారులు, సిబ్బంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



12.08.1994 కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి చేతులు మీదుగా నిర్మించారు. కార్యాలయంలో గదులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి మొత్తం 9 గదులు ఉంటే దాదాపు అన్ని దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ఎలాంటి ప్రమాదం జరగక ముందే గదులకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు, అధికారులు కోరుతున్నారు.

## నష్టపోయిన రైతులకు పరిహారంపై సర్వే

కోట,డిసెంబర్ 12 ప్రభాతవార్త

మాండౌస్ తుపాన్ ప్రభావంతో ముంపునకు గురైన బాధిత కుటుంబాలకు రూ 2వేలు, రేషన్ అందించాలని ప్రభుత్వం నిర్ణయిచింది. ఆమేరకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇంట్లోకి నీరు వచ్చినా ప్రభుత్వం పట్టించుకోలేదనే మాట రాకూడదని కచ్చితంగా వారికి సాయం చేయాల్సిందేనని సిఎం స్పష్టం చేశారని అధికారులు తెలిపారు. అదే విధంగా నష్ట పోయిన రైతులకు పంట నష్టం పరహారం కూడా ఇవ్వనున్నారు. అంచనాల నమోదును ఈ నెల 14 నుంచి 22 వరకు రైతు పొలాల్లో సర్వే చేస్తామని మండల వ్యవసాయాధికారి నిరంజన్ కుమార్ తెలిపారు. ఆయన సోమవారం ప్రభుతవార్త తో మాట్లాడుతూ సర్వే అనంతరం ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. ఆ మేరకు తమకు కమీషనర్ ఆదేశాలు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకొంటుందన్నారు.

## పారిశుద్ధ్యం పై దృష్టి సారించాలి

వాకాడు, డిసెంబర్ 12, ప్రభాతవార్త

తుఫాన్ తీవ్రత ప్రభావంగా గాలి వానలతో గ్రామీణ పరిసరాలు అపరిశుభ్రతగా దారితీసాయి. గ్రామాలలో డ్రైనేజ్ సౌకర్యాలు ఉండవు, వీధి సైడ్ కాలువలు మురికి నీరు గ్రామ చివర్లోకి తీసుకువెళ్లే అవకాశాలు లేక పల్లపు ప్రాంతపు వీధిలో, ఇండ్ల ముందట మురుగు నీరు నిల్వ కలిగి దుర్వాసన వెదజల్లుతున్నాయి. కురిసిన వర్షాల వలన లో తట్టు ప్రాంతాలలో వరద నిలిచి మడుగులను తులపిస్తున్నాయి ఇలాంటి మురుగు ప్రాంతాలు దోమలకు ఆవాసంగా మారి వ్యాదుల వ్యాప్తికి కారణమవుతాయి. దోమల నివారణకు లార్వా దశలోనే నియంత్రణ చర్యలు తీసుకుంటే మంచిదని ప్రజలు కోరుతున్నారు. ఈ మధ్య కాలంలో వస్తున్న వ్యాధుల్లో చాలా వరకు దోమ కాటుకు సంబంధించినవని దోమ కాటు చాలా ప్రమాదం వేలాది మంది ప్రజలు మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ, టైఫాయిడ్, మెదడు వ్యాపు, ఫైలేరియా, దోమ కాటుతో, జబ్బున పడుతూ పేద ప్రజలుకు లేని పోని రోగాలన్ని దోమల ద్వారానే వస్తున్నాయని అనేక అధ్యయనాలు తెలుపుతున్నాయని అన్నారు.

## వరద ప్రాంతాలలో పర్యటించిన ఆర్‌డిఓ

చిల్లకూరు డిసెంబర్ 12 ప్రభాతవార్త

గత మూడు రోజుల నుండి మండాస్ తుపాన్ కారణంగా మండలంలోని అన్ని గ్రామాలలో విస్తారంగా వర్షాలు కురువడంతో పిసివారిపాళెంగ్రామం వద్ద రాకపోకలు స్తంభించాయి. అదేవిధంగా తిప్పగుంట పాళెం వద్ద ఉప్పుటేరు వాగులోకి వరద ప్రవాహం ఎక్కువ కావడంతో ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం గూడూరు ఆర్‌డిఓ కిరణ్‌కుమార్ అధికారులతో కలసి బోటు సహాయంతో గ్రామానికి చేరుకొని అక్కడ వాలింటర్‌గా పనిచేస్తున్న ఈదూరు స్వరూప గర్భవతి కావడంతో పురిటి నెప్పులు ఎక్కువ కావడం అదేవిధంగా డయాలసిస్ వ్యాధితో బాదపడుతున్న శ్రీనివాసులరెడ్డిని ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాల సహాయంతో 108 ద్వారా గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. తిప్పగుంటపాళెం గ్రామానికి రాకపోకలు సాగించేందుకు బోటు ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్‌డిఓ అన్నారు. మండల స్థాయి అధికారులు వరదప్రాంతాలలో ఉన్న వారికి తక్షణ చర్యలు చేపడుతున్నామని అన్నారు. ప్రభుత్వం నుండి ఆర్థికసహాయం అందిస్తామన్నారు. 24 గంటలు అన్ని గ్రామాలలో సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి చైతన్య కుమార్, ఎంపిడిఓ విష్ణు చిరంజీవి, తహసిల్దారు జి స్వర్ణ, ఎస్ఐ బిగోపాల్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, విఆర్ఓ ఏడుకొండలు, పంచాయితీ కార్యదర్శి వెంకటరమణయ్య, క్రాంతి కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విఆర్ఓలపై పని భారం తగ్గించాలి



ఓజిలి, డిసెంబర్ 11, ప్రభాతవార్త

రెవెన్యూ విభాగంలో విఆర్ఓలపై పని భారం, ఒత్తిడి ఎక్కువైందని పని భారాన్ని తగ్గించాలని ఓజిలి మండలం గ్రామ రెవెన్యూ వీఆర్ఓల సంఘం సోమవారం డిమాండ్ చేసారు. అనంతరం తహశీల్దార్ డి. లాజరస్‌కు వినతి పత్రం అందజేసారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ విభాగంలో అధికారుల ఒత్తిడి, పని భారాన్ని తగ్గించాలని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ క్రాప్ బుకింగ్, వ్యవసాయ గణాంకాలు జగనన్న లే ఔట్లు, వెబ్ ల్యాండ్, నిషేధిత జాబితాతో పాటు కొత్తగా రీసర్వే బాధ్యతలతో వీఆర్‌వోలుతీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. నిత్యం నిర్వహించే విధులు, సమావేశాలు, ఇతర వేడుకలు వల్ల విధులతో విఆర్ఓలు నిత్యం నరకం చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రీసర్వేలో సర్వేయర్ ఉంటే సరిపోతుందని, కానీ అక్కడ కూడా విఆర్ఓకు విధులు కేటాయించడం దారుణమన్నారు. కలెక్టర్, ఆర్‌డివో, తహశీల్దార్ వద్ద తమ సమయమంతా గడిచిపోతుందని ఇక మిగిలిన పనులు ఎప్పుడు చేయాలన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్క విఆర్ఓ పని ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. ఒకనైనా ఉన్నతాధికారులు మా గోడు విని పని భారం తగ్గించాలని వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓలు కస్తూరయ్య, దిలిప్ కుమార్, నాగరాజు, యోహాన్, ప్రసన్న, విఆర్ఓలు పాల్గొన్నారు.

## కాకివాకం రోడ్డు జలయమం



వాకాడు, డిసెంబర్ 12, ప్రభాతవార్త

మాండూస్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కాకి వాకం గ్రామాలకు వెళ్లే రహదారులపై నీళ్లు రావడంతో రాకపోకలు స్తంభించాయి. సోమవారం వాకాడు మండలం దుగ్గరాజపట్నం పంచాయితీ పరిధిలోని కాకివాకం గ్రామస్తులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా భారీ వర్షాలు, వరదలు సంభవించినప్పుడు కాకి వాకు వెళ్లే రహదారి పై నీళ్ళు రావడంతో రహదారి కనిపించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షపునీరు తగ్గకపోవడంతో వ్యవసాయ రైతులకు కూడా ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి జరగకపోవడం వైల్డ్ లైఫ్ ఆంక్షలు వలన శాశ్వతమైన రహదారి నిర్మాణం కావడం లేదని గ్రామస్తులు వాపోయారు. కనీసం మౌళిక సదుపాయాలు నోచుకోక కాకివాకం గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. తుఫాను ప్రభావంతో వర్షపు నీళ్లలో నారు ముడులు మునిగిపోయిందని రైతులు బాధ వ్యక్తం చేసారు. కాకివాకం పంబలి రోడ్డకు ఇరువైపులా పులికాట్ సరస్సు ఉన్నందున సముద్రపు నీళ్లు పులికాటుకు వస్తున్నడంతో రహదారులు పైకి నీళ్లు రావడంతో చుట్టు పక్కల ఉన్న పొలాల్లో వేసిన పైరు కూడా మునిగిపోయిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు తెలిపారు. గతంలో రైతులు గ్రామస్తులు కలిసి రహదారులు మరమ్మతులు బాగు చేసుకున్నామని, అక్కడికక్కడ సొంత నిధులతో తూములు కట్టామని, తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వరదలు రావడంతో రోడ్డు అక్కడికక్కడ వేసి తూములు పోయాయని గ్రామస్తులు బాధ వ్యక్తం చేసారు.

# తిరుపతి డివిజన్

## ఎడతెరిపి లేకుండా వర్షం...కుశస్థలి నదిలో జోరుగా ప్రవాహం



నగరి, డిసెంబరు 12 ప్రభాతవార్త : మాందూస్ తుపాను నేపథ్యంలో నీటి పారుదల కాల్వల ద్వారా చెరువులకు భారీగా నీరు చేరుతోంది. కుశస్థలి నదిలో నీటి ప్రవాహం పెరిగింది. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. నగరిపేట, టి.ఆర్.కండ్రిగ ఇందిరమ్మ నివాసాల వద్ద వర్షం నీరు వీధుల్లో ప్రవహించింది. నగరిలో 27 మిల్లీమీటర్లు, విజయపురంలో 27.6, నింద్రలో 20.2, పుత్తూరులో 26.5, వడమాలపేటలో 20.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలు ప్రాంతాలపై పంటలపై నీరు చేరింది. వర్షం ఎడతెరిపి లేకుండా పడుతుండడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. రోడ్లపై జనసంచారం తగ్గింది. నీట మునిగిన పంటలను వ్యవసాయ శాఖ ఎడి సౌభాగ్యలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు అందించారు. కోత దశలో వున్న వరి గాలులకు పడిపోయినట్టయితే 4 నుంచి 5 నుంచి వరి దుబ్బులను ఒక దగ్గరకు చేర్చి కట్టగా కట్టి పంట కాపాడుకోవచ్చని తెలిపారు. అధికంగా వున్న నీరు తీసివేసి కంకులపై ఒక లీటరు నీటిలో 50 గ్రాముల ఉప్పు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలా చేయడం వల్ల తడిసిన గింజల నాణ్యత కాపాడుకోవచ్చని తెలిపారు. అలాగే దుబ్బు దశలో వున్న వరి పంటల్లో అధికంగా వున్న నీరు తీసేసి ఎకరాకు అర బస్తా యూరియా, 15 కిలోల పొటాష్ ఎరువు వేసుకుని పంటలను రక్షించు కోవచ్చని తెలిపారు. మిగిలిన పంటల్లో వెంటనే నీరు తీసేసి ఆరబెట్టుకోవాలన్నారు. తర్వాత డిఎం – 45 మందును 3గ్రాములు లీటరు నీటికి కలిపి ముందు జాగ్రత్త చర్యగా పిచికారి చేసుకోవాలని వివరించారు.

### తుఫాన్ బాధితులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే



తడ, డిసెంబర్ 12 ప్రభాతవార్త: మాందూస్ తుఫాన్ వల్ల నష్టపోయిన వారందరినీ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య భరోసా ఇచ్చారు. సోమవారం సాయంత్రం తడలో తుఫాన్ బాధితుల పునరావా కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లోతట్టు ప్రాంతాల నుంచి సకాలానికి సురక్షిత ప్రాంతానికి తరలించిన అధికారులతో మాట్లాడారు. ఎమ్మెల్యే వెంట తహశీల్దార్ రామయ్య, ఎంపిడిఓ మురళికృష్ణ, తడ సర్పంచ్ ఆర్ముగం, శశికుమార్, జయకుమార్, శ్రీనివాసులు, ఆఫ్రిది తదితరులు వున్నారు.

### శ్రీకాళహస్తీశ్వరాలయానికి విద్యుత్ డమరుకం వితరణ



శ్రీకాళహస్తి, డిసెంబర్ 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వ రాలయంలో స్వామిఅమ్మవార్లకు ప్రతిరోజు నిర్వహించే నిత్య దీపారాధనలో ఉపయోగించే విద్యుత్ ఆటోమేటిక్ డమరుకం మరియు గంటను తెలంగాణా రాష్ట్రం నిజామాబాద్ వాస్తవ్యులు కుంటసాయమ్మ, మరియు ఎర్రగంగారంలు ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ మరియు డిప్యూటీ కమిషనర్‌కు మల్లికార్జున్ ప్రసాద్‌కు అందించారు. ఈ సందర్భంగా దాతలకు స్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పిఆర్ఓలు బాలాజీ, సుధాకర్, మరియు ఛైర్మన్ సిసి సుదర్శన్‌రెడ్డి ఆలయ అధికారులు పాల్గొన్నారు.

### అన్నదానానికి విరాళం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి విజవాడ వాస్తవ్యులు డి.వెంకటేశ్వంరాజు మరియు కుటుంబసభ్యులు కలసి రూ.1,01,116లక్షలు విరాళాన్ని ఆలయ ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మరియు డిప్యూటీ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్‌కు అందించారు. ఈసంద్భంగా దాతలకు స్వామిఅమ్మవార్ల ప్రత్యేకదర్శనం చేయించి తీర్థప్రసాదాలను అందించారు.

### మృత్యుంజయస్వామికి విశేష అభిషేకాలు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 12 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు.సాధారణంగా వర్షాభావం సందర్భంగా ఇక్కడ ప్రత్యేక అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి.ఈ నేపథ్యంలో సోమవారం మృత్యుంజయ స్వామికి షోడషాభిషేకాలు నిర్వహించారు. ముఖ్యంగా పాలు,పంచామృతం,చందనం, విభూది, పచ్చకర్పూరంలో అభిషేకం జరిపారు.పుష్పాలంకారం ఎంతో ఆకట్టుకుంది. గజమాలలు, వెండి ఆభరణాలతో మృత్యుంజయస్వామిని అలంకరించి ధూప,దీప నైవేద్యాలు సమర్పించి మంగళహారతులిచ్చారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని హర హర మహాదేవ శంభోశంకర అంటూ స్మరించారు.

### చుక్కలనిడిగల్లు వాసులకు తాగునీరు



శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 12 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం చుక్కలనిడిగల్లు గ్రామంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు విద్యుత్‌లేక నీటికి ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి వెంటనే స్పందించి గ్రామానికి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. పలువురు మహిళలు సుధీర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

### పుణ్యక్షేత్రంలో మత్తుపదార్థాలను అరికట్టండి..తెదేపా



శ్రీకాళహస్తి, డిసెంబర్ 12 ప్రభాతవార్త : రాష్ట్ర తెలుగు దేశంపార్టీ కార్యాలయం ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి సూచనలతో తెలుగుయువత ఆధ్వర్యంలో పుణ్యక్షేత్రంలోని శ్రీకాళహస్తి పట్టణంలో యదేచ్చగా గంజాయి, డ్రగ్స్ మత్తుపదార్థాలును అరికట్టాలని కోరుతూ అర్బన్ ఎస్‌పి అంజూయాదవ్‌కు వినతిపత్రాన్ని అందించారు. పలువురు తెదేపా నాయకులు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో యదేచ్చగా మత్తుపదార్థాలు దొరుకుతున్నాయని, వీటితో విద్యార్థులు, యువత భవిష్యత్తును నాశనంచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముత్తుపదార్థాలను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుయువత అధ్యక్షులు కృష్ణయాదవ్, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ ప్రతాప్,రాష్ట్ర కార్యదర్శి దశరదాచారి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు సుబ్రమణ్యం (బుజ్జి) పట్టణ తెలుగుయువత అధ్యక్షులు అద్దంకి కిట్టు, ప్రధాన కార్యదర్శి వినయ్, కమిటీ సభ్యులు సిద్దులయ్య, మణి, తెలుగుదేశంపార్టీమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటారమేష్, మిన్నల్‌రవి, ప్రకాష్‌నాయుడు, సుబ్బయ్య, డిల్లీబాబు, బషీర్, కాసరం రమేష్, కిషోర్, కృష్ణమనాయుడు, ఎంఎస్‌రెడ్డి, మునిరాజయాదవ్, కరీం, గోవిందు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### *1100 ఎకరాల్లో నీటమునిగినిన వరి పైరు -ఈనెల 21వరకు గ్రామాల్లో సర్వే*

తొట్టంబేడు, డిసెంబర్ 12 ప్రభాతవార్త : ఈశాన్యరుతుపవనాలు, మరియు మాండోస్ తుఫాను ప్రభావం వల్ల కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలో 1100 ఎకరాల్లో పంటనష్టం జరిగిందని మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు ప్రతి గ్రామంలో పర్యటించి పంటనష్టాన్ని అంచనావేస్తామని, అనంతరం 22 నుంచి 27వ తేదీ వరకు సంబందిత రైతు భరోసా కేంద్రాల్లో పంటనష్టం కోల్పోయిన వారి వివరాలను ఉంచుతామన్నారు. సోమవారం చిన్నసింగమాల, రౌతుసూరమాల, లింగనాయుడుపల్లి, పొయ్య ఆర్‌బికె పరిధిలో పంటనష్టాలను అంచనావేశారు. వ్యవసాయాధికారితో పాటు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

### ఐకానిక్ వెస్పా-4 సరికొత్త రంగులు విడుదల



తిరుపతినగరం, డిసెంబర్ 12 ప్రభాతవార్త : ఫియాజియో వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇటాలియన్ ఫియాజియోగ్రూప్ అనుబంధ సంస్థ ఐకానిక్ వెస్పా ఎస్ ఎక్స్ ఎల్ వేరియంట్‌ల కోసం నాలుగు కొత్త రంగులను విడుదల చేస్తున్నట్లు సంస్థ ఛైర్మన్ డియోగో గ్రాఫీ తెలిపారు. కస్టమర్ల నుంచి విశేష స్పందన వచ్చిన తర్వాత వెస్పాను రిఫ్రెస్‌చేసిన శైలిచైతన్యంతో పరిచయం చేయడానికి సంతోషిస్తున్నామన్నారు. వెస్పా కేవలం స్కూటర్ మాత్రమే కాదని దేశం నుంచి పొందిన ఇటాలియన్ జీవనశైలి,, వారసత్వానికి చిహ్నమని తెలిపారు. కస్టమర్లకు సరిపోయే సరికొత్త మోటార్‌సైకిల్ ఇదే అన్నారు. వెస్పా ఎస్ ఎక్స్ రేసింగ్ 60ఎస్ నిష్క్రమించే వైట్‌తో పాటు జాడే స్ట్రీక్ రంగును ప్రదర్శిస్తుందన్నారు. కొత్త రంగులు ఈనెల నుంచి అన్ని డీలర్‌లలో అందుబాటులో ఉంటాయన్నారు.

### అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం-పోలీసుల అదుపులో ఇద్దరు

తొట్టంబేడు, డిసెంబర్ 12 ప్రభాతవార్త : మండలంలోని తంగేళ్ళపాళెం సమీపంలో అక్రమంగా రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న విజిలెన్స్ ఎస్ఐ ఎం.రామకృష్ణనాయక్‌కు హుటాహుటిన అక్కడికి చేరుకుని అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యం వాహనాన్ని అడ్డుకుని టుటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉంచారు. అయితే పరిధి తొట్టంబేడు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రావడంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్రకు సమాచారం అందించారు. దీంతో పట్టుకున్న 85కేజీల రేషన్‌బియ్యం బస్తాలు సుమారు 3,860కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు చెంచులక్ష్మికాలనీకి చెందిన సాయికుమార్, మంచినీళ్లగుంటకు చెందిన ప్రసాద్‌లను అదుపులోకి తీసుకున్నారు.స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని తంగేళ్ళపాళెం చౌకదుకాణంలో ఉంచారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ మురళీ, వీఆర్‌ఓ మువ్వర్లు అక్కడకు చేరుకుని బియ్యాన్ని పరిశీలించి తహశీల్దార్ సుబ్రమణ్యంకు సమాచారం అందించారు.

### ఈదులగుంట కాలనీలో తహశీల్దార్ పరిశీలన



తొట్టంబేడు, డిసెంబర్ 12 ప్రభాతవార్త : మండలకేంద్రంలోని సమీపంలో ఉన్న ఈదులగుంటలో ఉన్న కాలనీ వాసులను పునరావాస కేంద్రాలకు తరలించాలన్న ప్రభుత్వ అధికారులు కృషి ఫలించడం లేదు. గత నాలుగు రోజులుగా మాండోస్ తుపాను ప్రభావంతో ఈదులగుంటలో కట్టపైన సుమారు 40 కుటుంబాలు, ఈదులగుంటలో 150కుటుంబాలకు పైగా నివాసం ఉంటున్నారు. అయితే వర్షాభావంతో ఇండ్లలోకి నీరుచేయడంతో పాటు గుడిసెలు కూలిపోయే పరిస్థితుల్లో ఉన్నాయి. పరిస్థితిని తెలుసుకున్న తహశీల్దార్ ఐ.సుబ్రమణ్యం, డిప్యూటీ తహశీల్దార్ సుదీర్‌రెడ్డి, సిపిఐ నాయకులు జనమాలగురవయ్యలు అక్కడకి చేరుకుని వారితో చర్చించారు. వర్షాలకు ఇబ్బందులు ఎదుర్కొవడం కంటే కాలనీలో ఉన్న వారందరినీ పునరావాసకేంద్రాలకు తరలిరావాలని కోరగా వారు నిరాకరించారు. వస్తే తమ ఇండ్లను ఎక్కడ కూలదోల్చారోఅని వారి భయం. గత ఐదు రోజులుగా కూలిపనులు లేక పస్తులు ఉంటున్నారని పునరావాస కేంద్రాల్లో ఉంటే భోజనవసతి కల్పిస్తామని ఎంత నచ్చజెప్పినా వారు ససేమిరా అన్నారు.దీంతో సమాచారాన్ని సంబందిత ఆర్డీవో రామారావుకు తెలియజేశారు. కాలనీ వాసులతో పాటు అధికారులు, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

### పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దు



తిరుపతి ప్రెస్‌క్లబ్,డిసెంబర్ 12 ప్రభాతవార్త: పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కావద్దని భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక బైరాగిపట్టెడలోని గంథమనేని శివయ్యభవన్‌లో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా రామకృష్ణ, అడ్వైజర్ మైఖేల్‌రాజు పరీక్షలలో ప్రస్తుతం వచ్చిన మార్పులకు అనుగుణంగా ఎలా సన్నద్ధం కావాలి,అత్యుత్తమ మార్కులు సాధించ దానికి మెళుకవలను సూచించారు. ఈ కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల జోనల్ ఇన్‌ఛార్జ్ లక్ష్మణ్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### వయోవృద్ధుల ఆశీర్వాదంతో సక్కూర్ జన్మదిన వేడుకలు



చంద్రగిరి, డిసెంబర్ 12 ప్రభాతవార్త: మాతాపిత సమానులైన వయోవృద్ధుల ఆశీర్వాదంతో టిడిపి గల్లా యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సక్కూర్ ధనంజయ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి మాజీ పట్టణ అధ్యక్షుడు ధనంజయ రెడ్డి తన పుట్టిన రోజును పురస్కరించుకుని రామిరెడ్డిపల్లి పంచాయతీ, నాగయ్యగారిపల్లి వద్ద గల అరుణోదయా వృద్ధాశ్రమంలో వయోవృద్దులకు రుచికరమైన భోజనం వడ్డించి వారి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం అభిమానులతో కలసి వేర్వేరుగా కేకులు కట్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు అందుకున్నారు.

### ఇందిరమ్మ కాలనీలో బాలిక అదృశ్యం



చంద్రగిరి, డిసెంబర్ 12 ప్రభాతవార్త: చంద్రగిరి ఇందిరమ్మ కాలనీకి చెందిన మైనర్ బాలిక ఇంటి నుండి పారిపోయింది. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సోమవారం వడమాలపేట మండలం, అప్లాయగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద తచ్చాడు తుండగా చంద్రగిరికి చెందిన వ్యక్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ హిమబింధు బాలికను చంద్రగిరికి తీసుకురాగా, ఏఎస్ఐ కుమారి తల్లిదండ్రులకు అప్పగించారు.

### మంచినీటి కోసం కటకటలు ఎన్నాళ్లు - సీపీఎం నేతలు

రేణిగుంట, డిసెంబరు 12 ప్రభాతవార్త: తుఫాను కారణంగా రేణిగుంట మండలంలోని గుత్తివారిపల్లె ఎస్సీ, ఎస్టీ కాలనీలో విద్యుత్ సరఫరా లేక ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం పార్టీ రూరల్ కార్యదర్శి చీరాలయ్య సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంటు లేకపోవడంతో తాగునీరు లేక ఆ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన చెందారు. అధికారులు పట్టించుకోకపోవడం లేదంటూ ప్రశ్నించారు. తుఫాను వల్ల పంటలు నష్టం ఏర్పడి రైతులకు అపార నష్టం జరిగిందన్నారు. అధికారులు తక్షణం స్పందించి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేసిన వారిలో సీపీఎం పార్టీ రూరల్ ఏరియా నేత సెల్వరాజ్, మండల కార్యదర్శి హరినాథ్‌లు ఉన్నారు.

### *ఉరుస్తున్న పక్కగృహాలు-ఆదుకోవాలని బాధితుల వేడుకోలు..!*



నారాయణవనం, డిసెంబర్ 12 ప్రభాతవార్త : బంగాళాఖాతంలో ఏర్పడిన మండూస్ తుఫాన్ కారణంగా గత కొద్దిరోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు 1995వ సంవత్సరంలో నిర్మించిన పక్కాగృహాలు ఊరు స్తున్నది. పక్కగృహాలను నిర్మించి సుమారు 24సంవత్సరాలు పూర్తవడంతో పైకప్పులు మొత్తం ఊరుస్తున్నది. మండలంలోని తిరువట్యం, భీమునిచెరువు, బ్రాహ్మణతాంగేల్, కశింమిట్ట, ఎరిక ఒబట్టు, కల్యాణపురం, తుంబూరు, పాలమంగళం గ్రామాల్లో వందల సంఖ్యలో పక్కగృహాలు ఊరుస్తున్నది. దీంతో ఇళ్లలోకి వెళ్లలేని పరిస్థితి నెలకోవ డంతో నిరాశ్రయులుగా మిగిపోతున్నారు. ఊరుస్తుడడంతో ఇంటిలోపల మొత్తం నీటిలో మునిగిపోయి తడిసి ముద్దయ్యింది. ప్రభుత్వం ఇప్పటికైనా ఊరుస్తున్న పక్కగృహాల భాదితులను ఆదుకోవాలని కోరుతున్నారు.

### తుఫాన్ బాధితులందరిని తప్పక ఆదుకుంటాం



నారాయణవనం, డిసెంబర్ 12 ప్రభాతవార్త : బంగాళాఖాతంలో ఏర్పడిన మాండూస్ తుఫాన్ కారణంగా గత కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో నష్టపోయిన రైతులు, కౌలు రైతులందరిని తప్పక ప్రభుత్వ పరంగా ఆదుకోవడం జరుగుతుందని జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్ కుమార్, ఎంపిపి పి దివాకర్‌రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అరణ్యకండ్రిగ పంచాయతీ గోవిందప్ప నాయుడు కండ్రిగ రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అధికారులు క్షేత్రస్థాయిలో తుఫాన్‌తో నష్టపోయిన రైతులందరి నష్టాన్ని లెక్కించి తమకు నివేదిక ఇవ్వాలన్నారు. బాధిత రైతులందరి జాబితాను తమకు అందిస్తే తప్పక ప్రభుత్వపరంగా ఆదుకోవడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మురళి, పంచాయతీ కార్యదర్శి సుజన, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

### అన్నదాతలో చిగురిస్తున్న ఆనందం

నారాయణవనం, డిసెంబర్ 12 ప్రభాతవార్త : బంగాళాతంలో ఏర్పడిన మండూస్ తుఫాన్‌తో గత కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నది. పగలు రాత్రి అనే తేడా లేకుండా వర్షం కురవడంతో జన జీవనం పరిస్థితి అస్థవ్యస్థంగా మారిపోతున్నది. కురుస్తున్న భారీ వర్షాలతో చెరువులకు నీరు చేరుతున్నది. దీంతో రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తున్నది. రైతులు ఆనందం వ్యక్త పరుస్తున్నప్పటికి కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షంతో మూగజీవులకు సైతం మేత లేకుండా అల్లాడిపోతున్నది. ఓ పక్క వర్షం మరో పక్క చలితో మూగజీవులు తట్టుకోలేక చనిపోతున్నది. మూగజీవులపై ఆధారపడి బతుకుతున్న బాధితులు భోరున విలపిస్తున్నారు.

### ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగు పడడంతో పవర్ కట్

కేవీబీ పురం, డిసెంబరు 12 ప్రభాతవార్త: మండల కేంద్రమైన కేవీబీ పురంలో సాయంత్రం భారీ శబ్ధంతో సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పైన పిడుగు పడింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ మరలకు అమర్చిన పింగాణి దుగ్గు కావడంతో దీంతో మండల కేంద్రంలో పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. కేవీబీ పురం గ్రామ పంచాయతీ సర్పంచ్ కరపారెడ్డి గిరి విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో సత్వర చొరవ చూపి రాత్రి 8 గంటలకు వర్షం కూడా లెక్క చేయకుండా ఆ ట్రాన్స్‌ఫార్మర్ల పింగాణిలను అమర్చి విద్యుత్ సరఫరా అందించడంతో పంచాయతీ గ్రామస్థులు, పలువురు సర్పంచ్ గిరిపై హర్షం వ్యక్తం చేశారు.

### పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



తిరుపతిరూరల్, డిసెంబర్ 12 ప్రభాతవార్త: గ్రామ పంచాయతీల అభివృద్దే లక్ష్యంగా సర్పంచ్‌లు పని చేయాలని ఎంపిడిఓ వెంకటనారాయణ తెలిపారు. సోమవారం ఎంపిడిఓ సమావేశ మందిరములో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు కలిగిన గ్రామం, ఆరోగ్య వంతమైన గ్రామం, బాలల స్నేహ పూర్వక గ్రామం, నీటి సంవృద్ధి కలిగిన గ్రామం, పరిశుభ్రం, పచ్చదనం కలిగిన గ్రామం, స్వయం సమృద్ధితో కూడిన మౌళిక సదుపాయాలు కలిగిన గ్రామం, సామాజిక న్యాయం, సామాజిక భద్రత కలిగిన గ్రామం, సుపరిపాలనతో కూడిన గ్రామం, మహిళా స్నేహపూర్వక గ్రామం తదితర అంశాలపై తుమ్మలగుంట పంచాయతీ కార్యధర్శి మదుసూధన్ విశదీకరించారు. అన్ని గ్రామాలకు ఒకే రకమైన పనులు అవసరం ఉండదని, ఒక్కో గ్రామానికి అవసరాలు వేర్వేరుగా ఉంటాయని, అటువంటి అవసరాలను గుర్తించి, అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. ప్రజల భాగస్వామ్యంలో ప్రణాళికలు సిద్ధం చేసి, ఉన్న వనరులతో పారదర్శకంగా తయారు చేయసుకోవాల న్నారు. ప్రజల బాగోగులకు సంబంధించినవి తప్పనిసరిగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

### సాఫ్ట్ స్కిల్ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ



పుత్తూరు, డిసెంబరు 12 ప్రభాతవార్త : మునిసిపాలిటీలోని గోవిందపాలెంలో శ్రీ విద్య డిగ్రీ కాలేజీలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, శ్రీ విద్య డిగ్రీ కాలేజీ సంయుక్త ఆధ్వర్యంలో నవంబరు నెలలో జిల్లా స్థాయిలో నిర్వహించిన సాఫ్ట్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్‌కు సంబంధించిన ట్రెనింగ్ ప్రోగ్రామ్ 362 మంది విద్యార్థులు వారం రోజుల పాటు ట్రెనింగ్ తీసుకున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సోమవారం కాలేజీలో జరిగిన ఒక కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్మన్ ఎ.హరి, ఎంపిపి మునివేలమ్మ సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ చిత్తూరు జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి పి.వెంకటప్రసాద్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు సాఫ్ట్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. శ్రీ విద్య కాలేజీల ఛైర్మన్ జి.ఉమామహేశ్వర్ మాట్లాడుతూ తమ కాలేజీలో నిర్వహించే ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను తమ కాలేజీ విద్యార్థులే కాకుండా ఇతర కాలేజీల విద్యార్థులు కూడా వినియోగించుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ మాణిక్యం, ఎంబిఎ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ రవివర్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

### సుబ్రహ్మణ్యం మృతదేహానికి డిప్యూటీ సీఎం నివాళి

పుత్తూరురూరల్, డిసెంబరు 12 ప్రభాతవార్త: పుత్తూరు బ్రాహ్మణ సంఘ వ్యవస్థాపక గౌరవాధ్యక్షుడు కొండ వజ్జుల సుబ్రహ్మణ్యం(92) మృతి చెందాడు. ఆయన స్వగృహం ఆరేటమ్మ కాలనీలో ఉదయం 6 గంటలకు మృతి చెందాడు. ఆయన మృతికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ హరి, సదాశివేశ్వర ఆలయం ఛైర్మన్ రమేష్‌బాబు, తదితరులు ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

### శ్రీ సదాశివుని ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు

పుత్తూరురూరల్, డిసెంబరు 12 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణం మండల పరిధిలోని పలు శివాలయాల్లో కడపటి తమిళ కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడింది. పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి రామలింగేశ్వరస్వామి మండల పరిధిలోని నేసనూరు, తొరూరు, తిరుమలకుప్పం ఆలయాల్లో స్వామివారికి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అలాగే ఆలయాల ఆవరణలో మహిళలు పిండి దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ కొడగంటి రమేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పంచాయతీల అభివృద్ధిపై ప్రజాప్రతినిధులకు శిక్షణ



తొట్టంబేడు, డిసెంబర్ 12 ప్రభాతవార్త : పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక 2023–24కు సంబందించి సర్పంచ్‌లు, ఎంటిపిసిలు, మండల అధికారులకు మండలపరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ తరుణాక్షిరెడ్డి అధ్యక్షతన ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిధిగా ఎంపిపి ఉన్నం నిర్మల వాసుదేవనాయుడు, వైస్‌ఎంపిపి కన్నలిమల్లిక, మండల వైకాపా సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడులు, కోఆప్షన్ సభ్యులు ప్రేంకుమార్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి అన్నిశాఖల అధికారులు హాజరవగా వైద్యశాఖ, ఆరోగ్యశాఖ అధికారులు హాజరుకాలేదు. ఈసందర్భంగా ఎంపిపి నిర్మల మాట్లాడుతూ పంచాయతీల్లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి కావాల్సిన పనులను గుర్తించి పంచాయతీలోని ప్రజలతో సమావేశమై చర్చించుకోవాలని పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా ఉండాలన్నారు. ముఖ్యంగా తొమ్మిది అంశాలపై చర్చించారు. ఇందులో పేదరికం లేని మెరుగైన జీవనోపాధులు కలిగిన గ్రామం, ఆరోగ్యవంతమైన గ్రామం, బాలల స్నేహపూర్వక, నీటి సమృద్ధి, పరిశుభ్రం మరియు పచ్చదనం కలిగిన గ్రామాలు, స్వయం సమృద్ధితో కూడిన మౌళిక సదుపాయాలు కలిగిన గ్రామం, సామాజిక న్యాయం మరియు సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళా స్నేహపూర్వక గ్రామాలుగా మార్చడానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలని తెలిపారు. వైస్‌ఎంపిపి కన్నలి మల్లిక మాట్లాడుతూ పంచాయతీల్లో సమస్యలను అధికారులు గుర్తించి పరిష్కరించాలని కోరారు. ప్రస్తుతం వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయని ప్రతి ఒక్కరు నీటిని వేడిచేసి తాగాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఈఈ మమత తెలిపారు. ఇక పంటకాలువలు తవ్వించాలని కోరగా ఎవ్వరు ముందుకురావడం లేదని ఎపిఓ సుజాత తెలిపారు. ప్రజాప్రతినిధులు కూడా అన్నదాతలు, ప్రజలతో మాట్లాడి వరవకాలువలు, పంటకాలువలు తవ్వించేందుకు చర్యలుతీసుకోవాలని కోరారు. సమావేశంలో అన్నిశాఖల అధికారులతో పాటు, పంచాయతీ కార్యదర్శులు,సూపరింటెండెంట్ మధుసూధన్, సీనియర్ అసిస్టెంట్ జనార్ధన్, జూనియర్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### వరద నష్టాలను పరిశీలించిన ఆర్డిఓ

విజయపురం, డిసెంబరు 12 ప్రభాతవార్త : మండలంలోని తుపాను నష్టాలను సోమవారం ఆర్డిఒ సుజన పరిశీలించారు. జగన్నాధపురం, విజయపురం, కోసలనగరం, జంబాడ, మహారాజపురం పంచాయతీల్లో పంట నష్టాలను, చెరువు పరిస్థితి పరిశీలించారు. వరదల్లో నష్టపోయిన వివరాల నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దారు అమరేంద్రబాబు, ఎంపిడిఓ సతీష్, విఆర్ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

### నిరుపేదలకు సిఎం రిలీఫ్ ఫండ్



నగరి, డిసెంబరు 12 ప్రభాతవార్త : నింద్ర మండలం ఎలకాటూరుకు చెందిన నిరుపేద మహిళకు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సాయం అందించారు. సోమవారం మంత్రి కార్యాలయంలో అనారోగ్యంతో ఇటీవల చికిత్స పొందిన చిట్టెమ్మకు రిలీఫ్ ఫండ్ రూ. 1.20 లక్షల చెక్‌ను అందించారు. సిఎం సహాయ నిధి కింద తనకు ఆర్థిక సాయం అందించిన మంత్రికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. నింద్ర ఎంపిపి దీప, తదితరు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

### ఎంపిడిఓగా సతీష్

విజయపురం, డిసెంబరు 12 ప్రభాతవార్త : విజయపురం ఎంపిడిఓగా సతీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంపిడిఓగా వున్న ఈయన దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఇప్పటి వరకూ పుత్తూరు ఎంపిడిఓ ఇందిర అదనపు బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. సెలవు పూర్తి కావడంతో సతీష్ మళ్లీ ఎంపిడిఓగా బాధ్యతలు స్వీకరించారు.

### కెనడీనగర్ వరద బాధితులకు టిడిపి ఆసరా



తిరుపతి,డిసెంబర్ 12ప్రభాతవార్త: తుఫాన్‌తో భారీగా కురిసిన వర్షాలకు నగరంలోని కెనడీనగర్‌లో ఇళ్ళలోకి వరదనీరు చేరింది. బాధితులు నిరాశ్రయులయ్యారు. ఇళ్ళలో ఉంటున్న బాధితులకు సోమవారం మధ్యాహ్నం టిడిపి నాయకులు సుగుణమ్మ, ఆర్‌సి మునికృష్ణ, వట్టికుంట శంకరనారాయణ, మహేష్ యాదవ్, కృష్ణ, కృష్ణారెడ్డి,నీలిమ, కల్పన తదితరులు ఆహారం, తాగునీరు అందించారు.

### *సకాలంలో జీతాలు ఇప్పించండి:ఆర్డీఓకు 108 సిబ్బంది వినతి*

తిరుపతినగరం,డిసెంబర్ 12ప్రభాతవార్త: అత్యవసర సేవల్లో ఒకటైన 108 అంబులెన్స్‌ల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇచ్చేలా చూడాలని, గత రెండు నెలలుగా బకాయి ఉన్న వాటిని విడుదల చేయించాలని 108 సంస్థలో తిరుపతి జిల్లా పైలెట్లు, వైద్యసిబ్బంది కోరారు. ఈ మేరకు సోమవారం ఉదయం ఆర్‌డిఓ కనకనరసారెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. 108లో పనిచేస్తున్న ఉద్యోగులను కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించి, అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. 2019 ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీ మేరకు మాకందరికీ న్యాయం జరిగేలా అరబిందో యాజమాన్యానికి సూచించాలని పేర్కొన్నారు. కొన్ని అంబులెన్స్ వాహనాలు కండీషన్‌లో లేవని, వాటి స్థానంలో కొత్తవి మంజూరుచేసేలా చూడాలని వినతి పత్రంలో కోరారు.

# స్పందన ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించండి : మేయర్



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 12, ప్రభాతవార్త : డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమం వచ్చే ఫిర్యాదులు ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కరించాలని నగర పాలక అధికారులను నగర పాలక మేయర్ డాక్టర్ శిరీష ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం స్పందన కార్యక్రమంలో వచ్చి అర్జీలు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణీత కాల వ్యవధిలోపల సమస్యలను పరిష్కరించాలని అధికారులను మేయర్ శిరీష ఆదేశించారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్ అదే విధంగా ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి స్పందన కార్యక్రమం నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం, ఫిర్యాదులు ఎంఆర్‌పల్లి నుండి తెలుగు గంగ నీటి సరఫరా పైప్ లైన్ వేయాలని కోరారు. అన్నారం సర్కిల్ ఇంటి పట్టా కొరకు సంజయ్ గాంధీ కాలనీ, అండర్ డ్రైనేజీ ఓవర్ ఫ్లో అవుతున్నది. లక్ష్మి గంగా అపార్ట్మెంట్, వినాయక సాగర్ చెరువు కట్టపై ఉన్న చెట్లను తొలగించాలి. కేశవాయగుంట, కాలువలు శుభ్రపరిచాలని కోరారు. శివ జ్యోతి నగర్, గత మూడు నెలలుగా ఇంటి కుళాయి నందు త్రాగు నీరు రావడం లేదు, సమస్య పరిష్కరించాలని ఎస్‌కెడి నగర్ డమ్మీ వేసిన ఇంటి నీటి సరఫరా కనెక్షన్ తిరిగి ఇప్పించాల్సిందిగా కోరారు. శ్రీ వరసిద్ధి వినాయక టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్, రైల్వే పార్సెల్ ఆఫీస్, మున్సిపల్ స్థలం నందు కార్ పార్కింగ్ చేయుచున్నామని అచట కాంప్లెక్స్ నిర్మించుకున్నారని అందుకు వారికి పార్కింగ్ సౌకర్యం కల్పించాల్సిందిగా కోరారు. గొల్లవానికుంట మాస్టర్ ప్లాన్ రోడ్డు కొరకు టిడిఆర్ బాండ్ ఇప్పించవల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా అధికారులతో మేయర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గతంలో వచ్చిన ఫిర్యాదులు గడవులోపు పరిష్కరించాలని ఆదేశించారు. నగర పాలక పరిధిలో నుండి వచ్చిన అర్జీదారులు నుండి అర్జీలు స్వీకరించారు. మొత్తం 20 అర్జీలు రాగా వారి వారి శాఖలకు సంబంధించి అధికారులు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమంకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీల మీద తరచూ సమీక్ష నిర్వహించాలని, వచ్చిన అర్జీల మీద సత్వరం పరిష్కరించేవల్సిందిగా అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ శిరీష వారితో పాటు ఉప మేయర్ ముద్ర నారాయణ, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఎంఈ వెంకట్రామిరెడ్డి, డిపిపి దేవి కుమారి, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, రెవెన్యూ అధికారి కెవిఎల్ వర్మ, మేనేజర్ చిట్టిబాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రమణ్యం, షణ్ముగం, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## కూలేందుకు సిద్ధంగా ఉన్న సచివాలయ భవనం

**-అధ్వాన స్థితిలో మండల కేంద్ర సచివాలయం**



పెద్దపంజాణి,,డిసెంబర్ 12 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని సచివాలయ భవనం శిథిలావ్యవస్థ స్థితిలో కూలేందుకు సిద్ధంగా ఉంది. మండల కేంద్రంలో ప్రభుత్వం సచివాలయం కోసం నూతనంగా భవనం నిర్మాణం చేపడుతున్నప్పటికి ప్రస్తుతం తాత్కాలికంగా మండల కేంద్రంలోని జివిఎస్ భనంలో నిర్వహిస్తున్నారు.అయితే ఆ భవనం సిమెంటు సీట్లతో నిర్మించి ఉండడంతో గత నాలుగు రోజులుగా తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పైకప్పు నుండి వర్షపు నీరు కార్యాలంలో పడుతుండడంతో సిబ్బంది కంప్యూటర్ సామాగ్రిలపై ప్లాస్టిక్ పట్టల సహాయంతో భద్రపరుచుకుంటున్నారు.ఎప్పుడు భవనం కూలుతుందో అన్న భయంతో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.నూతన భవనం ఇప్పటికి నిర్మాణ దశలోనే ఉండడంతో సచివాలయ సిబ్బందికి ఇబ్బందులు తప్పటంలేదు.భవనం పరిస్థితి ఇలా ఉంటే పరిసరప్రాంతాలు వర్షాలకు మరింత అద్వానస్థితిలో ఉంది.కార్యాలయం ముందు చెత్తతో నిండి ఉండడం రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోవడంతో కార్యాలయానికి సైతం వెళ్లడానికి ప్రజలు,సిబ్బంది అష్టకష్టాలు పడుతున్నారు.అధికారులు భవన స్థితిని గుర్తించి ఇప్పటికైన తగు చర్యలు తీసుకుంటారా అన్న విషయం వేచి చూడాల్సి ఉంది.

## ఉత్తమ సేవలకు అత్యుత్తమ పురస్కారం

**-నాగలక్ష్మిని వరించిన ఉత్తమ గవర్నర్‌గిరి -చౌడేపల్లి క్లబ్‌కు అవార్డుల పంట**



చౌడేపల్లి, డిసెంబర్ 12 ప్రభాత వార్త: సమాజసేవకు అంకితమై ఎందరికో ఆసరాగా నిలచిన ఇస్సా నాగలక్ష్మిని జిల్లా వి211 ఉత్తమ గవర్నర్ పురస్కారం వరించింది. దీనితో పాటు చౌడేపల్లి వాసవీ- వనితా క్లబ్‌కు అవార్డుల పంట పండింది. హైదరాబాద్ క్లాసిక్ ఫంక్షన్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్య క్షుడు సుదర్శన్ చేతుల మీదుగా ఇస్సా నాగలక్ష్మి అవార్డును అందు కొన్నారు. అదే విధంగా వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పించినట్లు ఆమె తెలిపింది. అంతేకాకుండా చౌడేపల్లి రాణిఆంజనేయులకు ఉత్తమ జోన్ చైర్మన్‌గా వాసవీ- వనితాక్లబ్ అధ్యక్షులు లలిత, బద్రినారాయణలకు వారి సేవలను కొనియాడి వారికి సైతం అవార్డులందించారు. చౌడేపల్లి వాసవీ-వనితాక్లబ్ జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చినందుకు ఆర్యవైశ్య ప్రముఖులు వారిని అభినందలు తెలిపారు.

## తప్పిన పెను ప్రమాదం



పాలసముద్రం, డిసెంబర్ 12 ప్రభాతవార్త: మాండోస్ తుఫాను ప్రభావంతో మండలంలోని కావేరిరాజపురం పంచాయతీ పరిధిలో ఈదురు గాలులకు ఓ తాటి చెట్టు విద్యుత్ లైన్లపై పడింది. అయితే పరిసర ప్రాంతాల్లో ఎవరు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. గ్రామ ప్రజలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సర్పంచ్ మహేష్ దృష్టికి తీసుకెళ్ళడంతో ఆయన తహసిల్దారు బాబు, ఎంపిడిఓ విద్యావతిలకు ఈ విషయం తెలిపారు. ట్రాన్స్‌కో ఎఇ వరదరాజులు ఆధ్వర్యంలో సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి విద్యుత్ సరఫరాను పునరుద్దరించారు.

## గంగమ్మ హుండీకి విదేశీ కరెన్సీ...రూ.20.76లక్షలు

తిరుపతి,డిసెంబర్ 12ప్రభాతవార్త: తాతయ్యగుంట గంగమ్మ హుండీకి ఆదాయం భారీగా లభించింది. అమ్మవారి హుండీలో విదేశీ నాణేలు,కరెన్సీ వచ్చింది. అమ్మవారిని దర్శించుకుని కానుకలుగా గత 83రోజులు హుండీకి సమర్పించినవి సోమవారం లెక్కింపుచేశారు. ఆలయ చైర్మన్ గోపీయాదవ్ , ఇఓ. ఎం.మునికృష్ణయ్య ఆధ్వర్యంలో లెక్కింపుల్లో బంగారు,వెండి ఆభరణాలతోబాటు అమెరికన్ డాలర్లు 6, సింగపూర్ డాలర్లు 2, ఒమాన్ డాలర్లు 4 వచ్చాయి.

## కొండపై చోరీల అనామకుడు

తిరుమల,డిసెంబర్ 12ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలకొండపై గత కొన్నిరోజులుగా అనామకుడు దుకాణాల్లో చోరీకి పాల్పడుతూన్నాడు. వరుసగా సోమవారం ఉదయం కూడా మినీషాపింగ్ కాంప్లెక్స్ లో చేతివాటం చూపి ఓ దుకాణంలో నగదు కాజేశాడు. దుకాణాదారులూ ఆందోళన చెందుతున్నారు.

## వర్షాలతో మునిగిన పంటలు - లబోదిబోమంటున్న రైతులు



దొరవారిసత్రం, డిసెంబర్ 12 ప్రభాతవార్త : మాండోస్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. ఎంతో కష్ట పడి పంట వేసి నానా అవస్థలు పడుతున్న రైతులకు మాండోస్ తుపాను షాక్ ఇచ్చింది. వరితో పాటు తీగజాతి పంటలు, ఉద్యానపంటలు అన్నీ కూడా ఒక్కసారిగా దెబ్బతిన్నాయి. దొరవారిసత్రం మండల కేంద్రంలో సుమారు 2800 హెక్టార్లు వరి పంట పొట్ట దశలో ఉంది. ఈ పంటకు మాండోస్ తుపాను షాక్ ఇచ్చినట్లయింది. పొట్ట దశలో వరిపంట ఎన్ను తీస్తుండగా, ఒక్కసారిగా తీవ్రమైన గాలి, జోరుగా ఎడతెరిపి లేని వర్షానికి పంట దెబ్బతింది. మరికొన్ని లోతట్టు ప్రాంతాల్లో వరిపంట పూర్తిగా నీట మునిగింది. మండల పరిధిలోని సూరపు అగ్రహారం, అక్కరపాక, కల్లూరు, తనయాలి, ఉచ్చూరు తదితర గ్రామాల్లో వేసి ఉన్న మిరప, కాకర, బీర తదితర ఉద్యాన పంటలు నీటిమట్టం అయ్యాయి. పంట చేతికందే సమయంలో వర్షం కురవడంతో అన్నదాతలు ఏమీ చేయలేక దిగాలు పడుతున్నారు. ఒక్కొక్క రైతు సుమారు వేల రూపాయల్లో పెట్టుబడులు పెట్టి అటు పొలాల్లో నుంచి నీరు బయటకు పంపడానికి కూడా వీల్లేకుండా ఉండటంతో అన్నదాతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించాలని పలువురు కోరుతున్నారు.

## పేటను వీడని వర్షం...పొంగిపొర్లుతున్న వాగులు-వంకలు



నాయుడుపేట రూరల్ డిసంబరు 12 ప్రభాతవార్త ; మాండూస్ తుపాన్ ప్రభావంతో గతనాలుగు రోజులనుండి నాయుడుపేటలో వర్షం విడువకుండ కురుస్తుంది. వరుసగా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో చెరువులు, గుంటలు, కాలువలు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. గ్రామాల్లో ఎక్కడ సూచిన వర్షపునీరు ప్రవహిస్తుంది. నాయుడుపేటలో స్వర్ణముఖి,మామిడికాలువ ఉధృతంగా ప్రవహిస్తుంది. వరదనీటికి చిగురుపాడు, తిమ్మాజి కండ్రిగ, వెంగమాంబపురం, పండ్లూరు. కల్లిపేడు, అయ్యప్పరెడ్డిపాళెం తదితర గ్రామాలు చిగురుటాకుల వణుకుతున్నాయి.లోతట్టు ప్రాంతాల్లో పంట పొలాలు నీటమునిగాయి. మాండూస్ తుపాన్ ప్రభావానికి సుమారు 400ఎకరాల్లో వరిపంట నీటమునిగి నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు.మరికొన్ని గ్రామాల్లో వరద ఉద ృతికి పంట పొలాల్లో ఇసుకమేటలు ఏర్పడినట్లు రైతులు చెప్తున్నారు.కురుస్తున్న వార్షలకు రహదార్లపై గుంటలు ఏర్పడుతున్నాయన్నారు. గ్రామాల్లోవీధులు,రోడ్లు అద్వానంగా మారుతున్నాయి.వర్షాలకు చలిగాలి తోడుకావడంతో ప్రజలు చలికి అవస్థలు పడుతున్నారు.

## తిరుపతిలో ఎన్టీసి కాటన్‌మిల్లు పునరుద్ధరణ చేయండి : ఎంపి

తిరుపతి,డిసెంబర్ 12ప్రభాతవార్త: దేశవ్యాప్తంగా 23 టెక్స్‌టైల్స్ పరిశ్రమలనునడుపుతున్న కేంద్రప్రభుత్వ సంస్థ ఎన్‌టిసి తిరుపతి-రేణిగుంట సమీపంలో మూతబడిన కాటన్‌మిల్లును పునరుద్ధరణ చేసేలా నిధులు మంజూరుచేయాలని తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి కోరారు.ఈ మిల్లు పునరుద్ధరణ జరిగితే ఐదువేలమంది కుటుంబాలకు ఉద్యోగం, ఉపాధి కల్పించడానికి వీలవుతుందని తెలిపారు. సోమవారం పార్లమెంట్ సమావేశాల్లో తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి 377 ద్వారా లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళారు. తగినంత వనరులు ఉన్న తిరుపతిలోని కాటన్‌మిల్లును నమ్ముకుని దారిద్ర్యరేఖక దిగువన ఉన్న సుమారు వెయ్యి కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుందని కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళారు.

## తలకోన అభివృద్ధికి రూ.11.50కోట్లతో పనులు ప్రారంభం



యర్రావారిపాలెం,డిసెంబర్ 12 ప్రభాతవార్త : ప్రముఖ పర్యాటక క్షేత్రమైన తలకోన అభివృద్ధికి రూ.11.50కోట్లతో పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి తెలిపారు. కొత్తగా నిర్మించిన నవగ్రహాల మండపాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. రూ.1.23 కోట్లతో నిర్మించనున్న ఆలయ పుష్కరిణి పనులకు భూమి పూజ చేశారు. అభివృద్ధిలో భాగంగా నాలుగు మాడావీధుల నిర్మా ణం, జలపాతం వరకు పది అడుగుల వెడల్పుతో సిమెంటు రోడ్డు నిర్మాణం, జలపాతం వద్ద దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేకంగా గదుల ఏర్పాటు,జలపాతంకు వెళ్లే దారిలో అక్కడక్కడ రెండు విశ్రాంతి మందిరాలు నిర్మాణం చేపట్టనున్నారు. ఆలయం వద్ద పటిష్టమైన భద్రతకు గాను శాశ్వత పోలీసు అవుట్ పోస్టును ఏర్పాటు చేయనున్నామని ఎమ్మెల్యే తెలిపారు.ఎంపీపీ శివలక్ష్మి, జడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు చంగల్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మెన్ ఉమామహేశ్వరరెడ్డి, మాజీ అధ్యక్షులు రేవతి రెడ్డెప్పరెడ్డి, ఈఓ జయకుమార్, మండల కన్వీనర్ నాగార్జునరెడ్డి, నాయకులు బాలాజీ, సన్నీ

# ఏడు గంగమ్మల జాతరకు సన్నాహాలు-పోటీలు పడి చప్పరాలకు కుస్తి



శ్రీకాళహస్తి,డిసెంబర్ 12 ప్రభాతవార్త: దక్షిణకైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తిలో నిర్వహించే ఏడుగంగమ్మల జాతరకు ముస్తాబు అవుతుంది. ఈనెల 13,14 తేదుల్లో ఏడుగంగమ్మల జాతర నిర్వహించుటకు తేదీలను ఖరారు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పురాతన కాలం నాటి సంప్రదాయం, పద్ధతిలో జాతర నిర్వహణకు కమిటి నిర్వాహకులు నిర్ణయించారు.పూర్వ కాలం ముత్యాలమ్మగుడివీధిలోని గంగమ్మ రాయి నుంచి పసుపు మద్దులను చాటల్లో పెట్టుకొని స్థావరాల వద్దకు చేర్చి పూజలు నిర్వహించే వారని చెబుతున్నారు.ఈ ఏడాది సప్పరాల సంస్కృతినిఈ తరం పట్టణ వాసులు చూడనున్నారు. గత కొంత కాలంగా ముస్తాబుల మోజులో పరుగులు తీసిన యువకులకు గత ఏడాది నుంచి ముస్తాబులతో పాటు సంప్రదాయాలకు ప్రాధాన్య ఇస్తున్నారు. ప్రతి ఏడాది వివిధ ప్రాంతాల నుంచి కళాకారుల్ని, సినీ కళాకారుల్ని రప్పించి ముస్తాబులు చేసేవారు. రెండేళ్ళు కోవిడ్ నిబంధనలతో ఏకాంతంగా నిర్వహించినజాతర ఈ ఏడాది మళ్ళీ సంబరాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఓ వైపు వర్షం కురుస్తున్నా నిర్వాహకులు ఖాతరు చేయకుండా ముస్తాబులకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి జాతర చాటింపు జరిగింది. అయితే స్థావరాల వద్ద పందిళ్ళు వెలుస్తున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే గంగమ్మజాతరకు ఎంతో ప్రాధాన్యత ఉంది. సాధారణంగా ఏ ప్రాంతంలో అయిన ఒకే గంగమ్మను ప్రతిష్టించి పూజలు నిర్వహించటం ఆనవాయితి. కాని శ్రీకాళహస్తిలో ఏడుగంగమ్మల్ని ఏడు ప్రాంతాల్లో ప్రతిష్టించి పూజలు నిర్వహిస్తారు. దాంతో కొత్త దనాన్ని సంతరించుకుంది. ఏ ఏడాది కాఏడాది ఏడు గంగమ్మల జాతరలో కొత్త దనం సంతరించు కుంటుంది. జాతర నెల ముందు నుంచే ప్రణాళికలు రూపొందించుకునే వారు భక్తుల బాగస్వామ్యం చోటు చేసుకుంది. ఓ వైపు జాతర సన్నాహాలు మరో వైపు తుఫాను వర్షంతో పుణ్యక్షేత్రం వణుకుతుంది. చాటింపులో పోలస్వామి స్వర్ణమూర్తి పలువురు జాతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**జాతర చాటింపు-మాల ధారణ**

శ్రీకాళహస్తి ఏడుగంగమ్మల జాతర చాటింపును ఆదివారం రాత్రి నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణానికి చెందిన యువకులు గంగమ్మ మాల ధారణ జరిపారు.నాలుగు రోజుల పాటు ఎర్రటి దుస్తులు ధరించి నియమనిష్టలతోగడుపుతారు.

# అమరరాజాకు పెట్టుబడులు వెల్లువ..మంగళ్ ఇండస్ట్రీకి 250 కోట్లు పెట్టుబడి



రేణిగుంట, డిసెంబరు 12 ప్రభాతవార్త: అమర రాజా గ్రూప్‌కి చెందిన మంగళ్ ఇండస్ట్రీస్‌కు 250 కోట్ల రూపాయల పెట్టుబడితో చిత్తూరు జిల్లాలో నూతన ప్లాంట్ ఏర్పాటుకు చేస్తున్నట్లు చైర్మన్ గల్లా జయదేవ్ తెలిపారు. అమరరాజా గ్రూప్‌లో రెండవ అతి పెద్ద అనుబంధ సంస్థ(యూఎస్‌డీ 1.5 బిలియన్) మంగళ్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్(ఎంఐఎల్) సోమవారం ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా, పూతలపట్టు మండలం, తేనెపల్లి వద్ద గల మంగళ్ ఇండస్ట్రీయల్ కాంప్లెక్స్‌లో నూతన ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ ప్రతినిధులైన అమరరాజా కోఫౌండర్, చైర్మన్ గల్లా జయదేవ్ మంగళ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ హర్షవర్ధన్ గౌరినేని సంయుక్తంగా తెలిపారు. ప్లాంట్ ఏర్పాటు ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో అమరరాజా ఇంకా ఎన్నో పెట్టుబడులు పెట్టడానికి అవకాశాలు లభిస్తాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు దశాబ్ధాలకుపైగా 15 వేల మంది ఉద్యోగులతో అమరరాజా విరాజిల్లుతుందన్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఉపాధి కల్పనలో అగ్రగామిగా అమరరాజాను అభినందించారు. నూతన ప్లాంట్‌ను 250 కోట్ల రూపాయల పెట్టుబడితో అభివృద్ధి చేస్తామన్నారు. దాదాపు 2.15 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దీనిని నిర్మించనున్నామన్నారు. డిజైన్ ఆధారిత తయారీ కంపెనీ మంగళ్ ఇండస్ట్రీ అన్నారు. ఆటో విడి భాగాలు, మెటల్ ఫ్యాబ్రికేషన్, బ్యాటరీ విడి భాగాలు, టూల్ వర్క్స్, స్టోరేజీ పరిష్కారాలు, కస్టమ్ ఫ్యాబ్రికేషన్ వంటి విభాగాల్లో విస్తృత స్థాయి నైపుణ్యంతో విభిన్న పరిశ్రమలకు మంగళ్ ఇండస్ట్రీస్ తమ సేవలను అందిస్తుందన్నారు. బహుళ ఉత్పత్తుల కంపెనీగా ఇది దేశంలో అతి పెద్ద బ్రాండ్లను తమ వినియోగదారులుగా చేస్తున్నట్లు తెలిపారు. 3 వేల మంది ఉద్యోగులు, 9 తయారీ కేంద్రాఒల్ల మంగళ్ ముందంజలో ఉందన్నారు. సంస్థలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం అమరరాజా కట్టుబడి ఉండడం వల్లే అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నామన్నారు.

## పేదరికం నిర్మూలించడమే ప్రభుత్వ ధ్యేయం

**రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్‌కె రోజా**



నింద్ర,డిసెంబరు12 ప్రభాతవార్త : రాష్ట్రంలోని పేదరికం నిర్మూలించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్యేయం అని రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి ఆర్‌కె రోజా తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని అత్తూరు గ్రామ పంచాయతీ, ఒరురుపేట గ్రామ పంచాయతీలో గడప గడపకి మన ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఇంటింటికి వెళ్ళి రాష్ట్ర ప్రభుత్వం డిబిటి ద్వారా పేదలికి అందజేసిన సంక్షేమ పథకాల కరపత్రాన్ని లబ్ధిదారులకు మంత్రి ఆర్‌కె రోజా చేతుల మీదగా అందజేసారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మి ఓటువేసిన వారికి వేయని వారికి ప్రతి ఒక్కరికి వివిధ పథకాల రుపంలో సహాయం అందజేస్తున్నరని తెలిపారు.గతంలో రాష్ట్రంలో పరిపాలన చేసిన నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామిలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసారని విమర్శించినారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అబివృద్ధి చెందాలని వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజదానులు తీసుకొని వస్తా వుంటే ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడు 29 గ్రామాలే రాజధాని అని రియల్‌ఎస్టేట్ వ్యాపారస్థులకు మద్దతు తెలుపుతు న్నారని విమర్శించినారు. ఈకార్యక్రమంలో తహశీల్దారు అమరేంద్రబాబు,యంపిడిఓ వేణు,యంపిపి దీపా జలంధర్‌రాజు, మండల వైకాపా కన్వీనర్ వేణురాజు,సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్ణారెడ్డి,రాష్ట్ర వైకాపా యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్,కో ఆప్షన్ మెంబరు అనిల్,యంపిటిసిలు విజయ,విజేష్,వెలుగు ఎపియం చంద్రకళ,సిడిపిఓ శోభారాణి,నాయకులు గోపి,మహేష్, రామచంద్రారెడ్డి, తోయజాక్షి, సంపత్ కుమార్, బాబురెడ్డి,సుబ్రమణ్యంయాదవ్,సత్యరాజ,కన్నయ్య తదితరులు పాల్గోన్నారు.

## కాళంగి నదిలో జలహారతి - ఎమ్మెల్యే ఆదిమూలం



కేవీబీ పురం, డిసెంబరు 12 ప్రభాతవార్త: మండలంలో కాళంగి రిజర్వాయర్ మండూస్ తుఫాను కారణంగా జిల్లాలోని కేవీబీ పురం మండలంలో అత్యధిక వర్షపాతం 258 మి.మీ వర్షపాతం నమోదైంది. దీని ఫలితంగా నిండు కుండలా ప్రాజెక్టు నిండినందుకు సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం జలధార కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఎంపీటీసీ పుష్ప పరశురాముడు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించి కాళంగి నదిలోపూజలు చేసి జలధార కార్యక్రమం నిర్వహించారు. నదులు కర్పూరం, పసుపు కుంకుమ, పూల హారతలతో గంగమ్మ పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జలధార కార్యక్రమాన్ని ప్రారంభించి రైతన్నలకి పుష్కలంగా సాగునీటి అందించాలని వ్యవసాయ అభివృద్ధికి తగు ఏర్పాట్లు చేసి రైతులకు అన్ని సంక్షేమ పథకాలు శ్రేయస్కారంగా నిర్వహించి రైతు పురోగతి దిశగా వచ్చేందుకు రైతు భరోసా కేంద్రాల ద్వారా వారికి సంబంధించిన వ్యవసాయ విత్తనాలను ఎరువులను క్రిమి సంహారక మందులు అధికారులచే సూచనలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి, ఎంపీడీవో ఆనంద రావు, కాళంగి ప్రాజెక్టు ఎస్సీ ఈఈ, ఏఈ, అకాడమి డైరెక్టర్ గవర్ల కృష్ణయ్య, రాష్ట్ర మహిళా ఫైనాన్స్ డైరెక్టర్ పాడి వసంత లాల్ బాబుయాదవ్, మండల వైస్ ఎంపీపీలు దేరాల శ్రీనివాసులు, సరస్వతి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గౌనిపురం రాముర్మ, ఎంపీటీసీ పుష్ప పరశురాముడు, మండల బీసీ సంఘం అధ్యక్షుడు అగ్రహారం హరిబాబురెడ్డి, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు అరుణ్, మండల మహిళా అధ్యక్షులు గాలి రమప్రభ దామునాయుడు, సత్యవేడు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు బుర్ర మాధవిరెడ్డి, మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ హుస్సేన్, జాకీర్ భాయ్, మాధవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటరమణ శాస్త్రి, రాజు, చిరంజీవి, ఢిల్లీబాబు, మాజీ జడ్పీటీసీ డేవిడ్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్లెమడుగు డ్యాంకు జలకళ...పర్యాటకులతో సందడి



రేణిగుంట, డిసెంబరు 12 ప్రభాతవార్త: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ దొడ్లమిట్ట సమీపంలోని మల్లెమడుగు డ్యాం నీటితో నిండి కలకలాడుతుంది. పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది. డ్యాం గేట్లు ఎత్తడంతో నీరు హోరున సవ్వడి చేస్తూ ప్రవహించడం నయనానందకరంగా ఉంది. ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో తుఫాను కారణంగా ఇప్పటికీ వర్షాలు కురుస్తుండడం వల్ల మల్లెమడుగు రిజర్వాయర్ జలంతో నిండిపోయింది. సోమవారం మల్లెమడుగు రిజర్వాయర్ అధికారులు చెప్పిన సమాచారం మేరకు డ్యాంకు 2000 క్యా సెక్కులు నీరు ఇన్‌ఫ్లోగా వస్తుందన్నారు. రెండు గేట్లు మూడున్నర అడుగుల ఎత్తున, ఒక గేటు రెండు అడుగుల ఎత్తు లేపి సుమారు 2500 క్యా సెక్కుల నీటిని అవుట్‌ఫ్లోగా దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుత డ్యాంలో నీరు 365 అడుగులు ఉందని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్‌బాబు ఆదేశాల మేరకు అధికారులు అప్రమత్తంగా ఉండి అనుక్షణం పరిస్థితులను సమీక్షిస్తున్నారు.

## చెరువులు, ప్రాజెక్టులకు జలకళ

నారాయణవనం, డిసెంబర్ 12 ప్రభాతవార్త : గత నాలుగురోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని తిరువట్యం ప్రాజెక్టు, నక్కలచెరువు, కీళగరంలోని కోమాలచెరువు, పాలమంగళంలోని అయ్యవారికండ్రిగ చెరువు, తుంబూరు చెరువులకు నీటి కళ ఏర్పడింది. తిరువట్యం చెరువును ప్రాజెక్టుగా 2009వ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సుమారు 36కోట్ల రూపాయాలను ప్రాజెక్టు నిర్మాణానికి మంజూరు చేశారు. ప్రాజెక్టు పూర్తిగా నిండడంతో పాటు కలుజు పారుతున్నది. ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో నిండిన చెరువుల క్రింద భూములు కలిగిన రైతులు పంటసాగు చేయడానికి ఉత్సహం చూపుతున్నారు. అలాగే ఎరికంబట్టు, భీమునిచెరువు, వెత్తలతడుకు, కొండలచెరువు చెరువులు కూడా నిండుతున్నది.

## స్పందన అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

**-తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి**

తిరుపతిరూరల్, డిసెంబర్12 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, స్పందన అర్జీలపై ముఖ్యమంత్రి తరచూ సమీక్ష నిర్వహిస్తున్నారని జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి తెలిపారు. స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 61 అర్జీలు అందినట్లు తెలిపారు. రెవెన్యూశాఖకు సంబంధించి 40, మునిసిఫల్‌కు సంబంధించి 1, పోలీసు శాఖ 2, డ్వామా 2, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ 2, పంచాయతీ రాజ్ 3, హౌసింగ్ 2, ఆర్ అండ్ బి 1, డిసిహెచ్‌కు సంబంధించి 3, నేషనల్ హైవేకు సంబంధించి 1, విద్యుత్ శాఖకు సంబంధించి 1 అర్జీ రావడం జరిగిందన్నారు. స్పందన అర్జీలను జిల్లా అధికారులు త్వరగా పరిష్కారమయ్యేల చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## ఎడతెరిపి లేని వర్షాలతో నీట మునిగిన పంటలు



విజయపురం, డిసెంబరు 12 ప్రభాతవార్త : ఎడతెరిపి లేకుండా సోమవారం కూడా వర్షాలు కురుస్తుండ దంతో మండలంలో పలు చోట్ల పంటలు నీట మునిగాయి. మండలంలోని పాతార్కాడు వద్ద చేతి కందే ఉద్దుల పంట, ఇల్లత్తూరులో వరి పంటలు నీట మునిగాయని రైతులు వాపోయారు. మండలంలోని పలు చోట్ల వరి, చెరుకు పంటలు నేలకొరిగాయి. వర్షాల కారణంగా రోడ్లు దెబ్బతిని వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి.

## పోలీస్ స్పందనకు 18 ఫిర్యాదులు

చిత్తూరు, డిసెంబర్ 12 ప్రభాతవార్త: ప్రజా సమస్యలను పరిష్కరించడానికి పాత జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతివారం నిర్వహించే స్పందన కార్యక్రమంకు ఈ వారం 18 సమస్యలు అందాయి. అడ్మిన్ ఎఎస్పీ పి.జగదీష్ స్పందన కార్యక్రమంకు హాజరై ప్రజల నుండి సమస్యలపై వచ్చిన అర్జీలు స్వీకరించి వాటిని సత్వరం పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీస్ స్పందన కార్యక్రమంలో వేధింపులకు సంబంధించి 2, ఆస్తి తగాదాలకు సంబంధించి 16 సమస్యలు అందాయి.

## సదుంలో పొంగి ప్రవహిస్తున్న ప్రాజెక్టులు



సదుం, డిసెంబర్ 12ప్రభాతవార్త : మండల పరిధిలో కురిసిన వర్షాలకు ప్రాజెక్టులు నిండి పొంగి ప్రవహి స్తున్నాయి. కొర్లకుంటవారిపల్లె వద్ద ఉన్న కొర్లకుంట ప్రాజెక్టు నిండిపోయి మొరవ ప్రవహిస్తు దిగువకు ప్రవహిస్తోంది. ఈనీరంతా గార్గేయనదిలో వస్తుండటంతో సదుం-పీలేరు మార్గంలోని పాపిరెడ్డిగారిపల్లె ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. అదికూడా నిండిపోయి నిండుకుండను తలపిస్తూ నీరు మొరవద్వారా కిందకు వెళుతోంది. దీనికింద బాలంవారిపల్లె రహదారి కింద ప్రస్తుతం ప్రవహిస్తున్నా పైనుంచి నీరు వస్తే పీలేరు రహదారిపై నీరు వెళ్లి ప్రవహించే ప్రమాదం ఉంది. గతంలో ఒక సారి ఈ వంతెన తెగిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అదేవిదంగా కంభంవారిపల్లె పంచాయతీలోని సింహంగుండ్ల ప్రాజెక్టు రెండు రోజుల కిందటే నిండిపోయి మొరవ ప్రవహిస్తోంది. ఈనీరు కూడా అటు గార్గేయనదిలోకలుస్తోంది. మద్యలో కలికిరి సదుం మార్గంలో తాత్కాలిక వంతెన వద్ద ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. నీరు ఎక్కువైతే ఈమార్గం మూత పడుతుంది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మండలంలో అన్ని ప్రాంతాలలో భారీ వర్షం కురిసింది. దీనితో చెరకువారిపల్లె పంచాయతీలోని సదుం నంజంపేట మార్గంలోఉన్న అయ్యవారిచెరువు మొరవ ప్రవహిస్తోంది. ఈమొరవలో గత యేడాది వర్షాలప్పుడు కారు కొట్టుకుపోయింది. ఈవిషయం తెలుసుకున్న తహశీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీఓ వరప్రసాద్, ఎస్ఐ మారుతిలు తమ సిబ్బందితో వెళ్లి రహదారిని మూసివేశారు. వాహనాలు ఆమార్గంలో వెళ్లకుండా కాపలా పెట్టారు. వర్షాలకు పుంగనూరు నియోజక వర్గ ప్రత్యేకాధికారి డ్వామా పీడీ చంద్రశేఖర్ సదుంలో పర్యటించి గార్గేయనది వంతెనలను తనిఖీ చేశారు. వర్షం ఎక్కువై నీరు వంతెనలపై వెళితే ఆ వంతెనలపై రాకపోకలు నిలిపి వేయాలని సూచించారు. సచివాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి వర్షంకు సంబందించి పలు సూచనలు చేశారు. అదేవిధంగా సోమల మండలంలోని జీరోలవంకనుపరిశీలించారు. అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి జాగ్రత్తగా ఉండాలని సూచించారు.